ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5


గురువారం 26 సెప్టెంబరు 2024




విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

- నాటి వైసీపీ పాలనలో చిట్టడవిలా రైతుల ప్లాట్లు
- నేడు అద్దాల్లా చదునుగా దర్శనమిస్తున్న వైనం
- నాడు ఒక వెలుగు వెలిగిన ఆర్- 5 జోన్ ప్లాట్లు
- నేడు కంప చెట్లుతో నిండిపోయిన వైనం
- కోర్టు కేసు నడుస్తుండడంతో ఆ వైపు చూడని సీఆర్డీఏ

సిద్ధమవుతోన్న.. రైతుల ప్లాట్లు


నాడు కంపచెట్లతో వున్న రైతుల ప్లాట్లు, పొలాలు

కంపచెట్లు తొలగడంతో కనువిందుగా రైతుల ప్లాట్లు, పొలాలు


కంపచెట్లతో నిండిపోయిన అంతర్గత రహదారి నాడు..

కంపచెట్లు తొలగించిన తరువాత రోడ్లు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓడలు బళ్లు.. బళ్లు ఓడలు కావడం అంటే ఇదేనేమో.. గత వైసీపీ పాలనలో చిట్టడవిలా మారి, చీకటితో నిండిపోయిన నవ్యాంధ్ర రాజధాని నేడు వెలుగులు చిమ్ముతోంది. నాడు రైతుల గుండెల్లో కుంపట్లు రాజేసిన ఆర్- 5 జోన్ నేడు కంప చెట్లతో అడవిలా మారిపోయింది. సరిగ్గా 15 నెలల్లో ఎంత మార్పు! 'ఇదే నా మాట.. నా మాటే శాసనం అన్నట్లుగా' సాగిన గత ఐదేళ్ల జగన్మోహనరెడ్డి పాలనలో 'తామే శాశ్వతం.. తామన్నదే వేదం.. తాము చెప్పిందే చట్టం' అన్నట్లుగా అమరావతిపై ఇష్టారీతిగా విరుచుకుపడ్డారు. సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఉల్లంఘించి ఆర్- 5 జోన్ పేరుతో రాజధాని రైతుల గుండెలపై చిచ్చు రాజేశారు. సరిగ్గా ఏడాదిలోపే నియంతృత్వ పోకడలతో అమరావతి ధ్వంస రచన చేసిన వైసీపీ సర్కారు కుప్పకూలిపోయింది. టీడీపీ- జనసేన- బీజేపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తెరపైకి వచ్చింది. అంతే పరిస్థితి మొత్తం తలకిందులైపోయింది.

కళకళలాడుతున్న ప్లాట్లు

రాజధాని కోసం భూములిచ్చిన 28,500 మంది రైతులకు ఇవ్వాల్సిన రిటర్నబుల్ ప్లాట్లను వైసీపీ ప్రభుత్వం తీవ్రనిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లపాటు వాటిని పట్టించుకోకుండా వదిలేసింది. దీంతో కంపచెట్లతో రైతుల ప్లాట్లు అడవిలా మారిపోయాయి. పరిపాలనా వికేంద్రీకరణ పేరుతో జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన మూడు రాజధానుల చట్టాన్ని కొట్టివేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం 2022 మార్చి 30న చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ఆ తీర్పులో రైతుల ప్లాట్లలో వున్న చెట్లను తొలగించి వారికి ఆరు నెలల్లో స్థలాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ గత ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడిందే తప్ప ఒక్క చెట్టు కూడా తొలగించలేదు. అలాంటి రైతుల ప్లాట్లు కూటమి ప్రభుత్వం రాకతో కళకళలాడుతున్నాయి. 36.5 కోట్ల రూపాయలతో కూటమి ప్రభుత్వం 24వేల ఎకరాల్లో కంపచెట్లను తొలగించింది. కిందటి నెల 7న కంప చెట్ల తొలగింపుకు మంత్రి నారాయణ శ్రీకారం చుట్టగా నెల రోజుల్లో రాజధాని స్వరూపం మారిపోయింది. కాంట్రాక్టు దక్కించుకున్న ఎన్‌సీసీ సంస్థ పనులను శరవేగంగా సాగించింది. వర్షాలు పడినప్పటికీ పనులు వేగంగా సాగేలా చూసింది. దీంతో రైతుల ప్లాట్లు అందంగా కళకళలాడుతున్నాయి.


నాడు ఆర్- 5 జోన్ ప్లాట్లు


నేడు కంపచెట్లతో అడవిలా ఆర్- 5 జోన్

అడవిలా మారిన ఆర్- 5 జోన్

రాజధాని మాస్టర్ ప్లాన్‌ను విచ్ఛిన్నం చేసి, రాజధాని నిర్మాణాన్ని శాస్వతంగా సమాధి చేయాలని భావిస్తూ జగన్ సర్కార్ 2023లో 'రాజధానిలో పేదలకు ఇళ్లు' అంటూ ఆర్- 5 జోన్ చిచ్చు రాజేసింది. రాజధానికి అత్యంత కీలకమైన ఎలక్ట్రానిక్ సిటీ, ఫైనాన్షియల్ సిటీలను, పరిశ్రమలకు కేటాయించిన భూములను టార్గెట్ చేస్తూ ఆ భూముల్లో 53వేల మందికి సెంటు స్థలాలు ఇచ్చేందుకు ప్లాట్లు వేశారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల స్థలాల్లో చెట్ల తొలగింపుకు రూపాయి కూడా ఖర్చు చేయని వైసీపీ ప్రభుత్వం ఆర్- 5 జోన్లో ప్లాట్ల పేరుతో అక్షరాలా రూ. 130 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కంప చెట్లు తొలగించి, ప్లాట్లలో మెరక తోలించి, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్లు బిగించి, రోడ్లు వేయించి ఆర్- 5 జోన్‌ను సర్వాంగ సుందరంగా సిద్ధం చేసింది. రైతుల పోరాటం కారణంగా సుప్రీంకోర్టు ఆ వ్యవహారాన్ని అడ్డుకొంది. అంతే ఆర్- 5 జోన్‌కు కుట్ర ఆగిపోయింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆర్- 5 జోన్ అడవిలా మారిపోయింది. ఆర్- 5 జోన్ వ్యవహారం న్యాయస్థానాల పరిధిలో వుండడంతో కూటమి ప్రభుత్వం దాని జోలికి పోలేదు. దీంతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ప్లాట్లు మొత్తం చిల్ల కంప అల్లుకుపోయింది.

రోడ్లకు మహర్దశ

కూటమి ప్రభుత్వం వచ్చినవెంటనే రాజధానిలో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించింది. వైసీపీ పాలనలో మట్టిదిబ్బలతో, కంపచెట్లతో నిండిపోయిన సీడ్ యాక్సిస్ రోడ్డుకు మహర్దశ పట్టింది. అది తాజాగా ఎన్‌హెచ్-16తో అనుసంధానం కాబోతోంది. కంపచెట్ల తో నిండిపోయిన అంతర్గత రోడ్లు అం దంగా తయారై, వినియోగా నికి పూర్తిగా సిద్ధమయ్యాయి.

కంటి పాపలకు.. కష్టమొచ్చింది

- ప్రభుత్వ పాఠశాలల్లో 38,008మంది విద్యార్థులకు కంటి సమస్యలు
- ఈ విద్యా సంవత్సరంలో 3.05 లక్షల మందికి కంటి పరీక్షలు
- 5,180 మందికి ఉచిత కళ్ళజోళ్ళు పంపిణీకి ప్రణాళిక

గుంటూరు(విద్య), సెప్టెంబరు 25: పేదరికం.. పౌష్టికాహార లోపం.. అవగాహన రాహిత్యం వెరసి పేదకుటుంబాల్లో విద్యార్థులకు కంటి సమస్యలు శాపాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి దిగ్భ్రాంతికర పరిస్థితులు భావిపౌరుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అంధత్వనివారణ సంస్థ నిర్వహించిన కంటిపరీక్షల్లో 38వేల మందికి పైగా విద్యార్థులు కంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు నిర్ధారించారంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అవగతం చేసుకోవచ్చు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్, మండల పరిషత్ పాఠశాలల్లో దాదాపు 6.75లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాస్యం చేస్తున్నారు. ఇందులో అనేకమంది పౌష్టికాహారం లోపంవల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు ప్రభుత్వ గుర్తించింది. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో భాగంగా కంటిపరీక్షలు నిర్వహించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. తొలి విడత ఈ ఏడాది సెప్టెంబరు నెలాఖరువరకు ఉమ్మడి జిల్లాలోని 1188 పాఠశాలల్లో 3.08లక్షల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో దాదాపు 38,008 మంది విద్యార్థిని విద్యార్థులు ఏదో ఒక కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. వీరిలో తప్పని సరిగా కళ్ళజోళ్ళు అవసరమైన విద్యార్థులు 5,186 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరికి త్వరలో కళ్ళజోళ్ళు పంపిణీ చేయడానికి జిల్లా అంధత్వనివారణ, సమగ్రశిక్ష అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

గుర్తింపు ఇలా....

పాఠశాలల్లో కంటి సమస్యలతో ఇబ్బందులు పడే విద్యార్థులను గుర్తించడానికి సైన్స్ ఉపాధ్యాయులు, ఏఎన్ఎం, ఇతర వైద్యసిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వారికి కొన్ని పరికరాలు అందజేశారు. సమస్యలు గుర్తించడానికి జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా దాదాపు 600మందికిపైగా ఉపాధ్యాయులకు ప్రత్యేకశిక్షణ అందించారు.

కంటి సమస్యలకు ఇవీ ప్రధాన కారణాలు...

దృష్టిలోపానికి ప్రధానంగా ఆరు కారణాలను వైద్యులు చెబుతున్నారు. కంటికి దెబ్బ లేదా గాయం ఏర్పడడం, పోషకాహారలోపం, అంటువ్యాధులు, రసాయనిక చర్య అంటే కంట్లో హానికరమైన ద్రవాలు, రంగులు పడడం, వంశపారంపర్యం, ఆపరేషన్ తరువాత వచ్చే ఇన్‌ఫెక్షన్ సమస్యలు ప్రధాన కారణాలని కంటి వైద్యులు చెబుతున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అత్యధిక మంది పౌష్టికాహారం లోపం, వంశపారంపర్య కారణాల వల్ల కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు కంటి వైద్యులు చెబుతున్నారు.

ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ

● డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్



జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను ఆగస్టు నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు పాఠశాలల్లో ఉచితంగా కంటి పరీక్ష లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అంధత్వనివారణ సంస్థ అధికారి డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ ఆంధ్రజ్యోతికి వివరించారు. ఇప్పటికే 2.80లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 36,411 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తిం చినట్లు తెలిపారు. వీరిలో 3,798 మందికి ఉచితంగా ఈ ఏడాది కళ్ళజోళ్ళు ప్రభుత్వం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న ట్లు తెలిపారు. అక్టోబరు నెలాఖరు వరకు కంటి పరీక్షల స్కీనింగ్ పాఠశాలల్లో జరుగుతుందని పేర్కొన్నారు.

జీతం ఒక చోట.. కొలువు మరో చోట

- ఆర్డీవో కార్యాలయంలో సిబ్బంది కొరత
- వివిధ పనులపై వచ్చే వారికి తప్పని తిప్పలు



చీరాల ఆర్డీవో కార్యాలయం

చీరాల, సెప్టెంబరు 25: చీరాల ఆర్డీవో కార్యాలయాన్ని సిబ్బంది కొరత వెంటాడుతోంది. కార్యాలయంలో ముగ్గురు తహసీల్దార్లను డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపించారు. కానీ వారి జీతాలు మాత్రం ఈ కార్యాలయం నుంచే చెల్లిస్తున్నారు. దీంతో జీతం ఒక చోట, కొలువులు మరో చోట అవడంతో తాము ఇబ్బంది పడుతున్నామని వివిధ పనులపై వచ్చే వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో మొత్తం 10 మంది ఉండాల్సి ఉండగా ఐదుగురు మాత్రమే ఉన్నారు. చీరాల ఆర్డీవో కార్యాలయ పరిధిలో చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలు, పది మండలాలు ఉన్నాయి. కార్యాలయంలో ఆర్డీవో ఒకరు, డీఏవో ఒకరు, డిప్యూటీ తహసీల్దార్లు ముగ్గురు, సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురు, జూనియర్ అసిస్టెంట్ ఒకరు, టైపిస్ట్ ఒకరు ఉండాలి. అయితే ముగ్గురు డీటీలు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు లేరు. ముగ్గురు డీటీ(డిప్యూటీ తహసీల్దార్)లు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఒకరు బాపట్ల, మరొకరు పర్చూరు, వేరొకరు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి పీఎస్(పర్సనల్ సెక్రటరీ)గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఆ ముగ్గురికి ప్రతి నెలా జీతాలు మాత్రం చీరాల ఆర్డీవో కార్యాలయం నుంచి డ్రా చేస్తున్నారు. దీంతో జీతం ఒక చోట.. కొలువు మరో చోట అయితే ఎలా అని వివిధ పనులపై వచ్చేవారు ఆక్షేపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి ఆర్డీవో కార్యాలయంలో పూర్తి స్థాయిలో అధికారులు, సిబ్బందిని నియమించి పనులు పారదర్శకంగా, జాప్యం లేకుండా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డీపీఈవోగా దేవదత్తు

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): డీపీఈవో (డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్)గా జి.దేవదత్తును నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఇక్కడ డీపీఈవోగా ఉన్న అరుణకుమారి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. మద్యంపై నూతన పాలసీని త్వరలోనే ప్రభుత్వం తేనుండడంతో ఈ బదిలీలకు ప్రాధాన్యత నెలకొంది. వైసీపీ హయాంలో ఎక్సైజ్ శాఖలోని ఉద్యోగులను చీల్చి సెబ్‌ను ఏర్పాటు చేసి దాని పాలనను నీరుగార్చిన సంగతి తెలిసిందే. ఇన్ని రోజులూ అయిష్టంగానే సెబ్‌లో పనిచేసిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంతో సొంతగూటికి చేరుకున్నారు. ఎక్సైజ్ శాఖలో బదిలీలకు ఈ నెలాఖరు వరకు గడువు ఉండడంతో సెబ్‌లో పనిచేసిన ఉద్యోగులకు కూడా పోస్టింగ్‌లు దక్కనున్నాయి. జిల్లాలో మొన్నటి వరకు సెబ్‌లో పనిచేసిన ఉద్యోగులను రిలీవ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

వైసీపీ పగ్గాలు మాకొద్దు

- అధినేత జగన్‌ను కలిసిన చీరాల నేతలు
- జిల్లా అధ్యక్ష బాధ్యతలను చేపట్టలేనన్న కరణం
- గాదె మధుసూదనరెడ్డికి ఖరారయ్యే అవకాశం

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పగ్గాలను స్వీకరించాలని కరణం వెంకటేశ్ ను ఇటీవల జరిగిన సమావేశంలో అధినేత జగన్ కోరగా నిర్ణయం తెలపడానికి సమయం కోరిన సంగతి తెలిసిందే. చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంతో పాటు ఆయన చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన కుమారుడు వెంకటేశ్ బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్‌ని కలిసినట్లు సమాచారం. తనకు వైసీపీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు వద్దని వెంకటేశ్ తిరస్కరించడమే కాకుండా తమను చీరాలకే పరిమితం చేయాలని మాజీ ఎమ్మెల్యే బలరాం కృష్ణమూర్తి కోరినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు మధుసూదనరెడ్డికి జిల్లా పగ్గాలు అందించనున్నారని తెలుస్తోంది. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మోపిదేవి వెంకటరమణ పార్టీతో పాటు ఎంపీ పదవికి కూడా ఇటీవల రాజీనామా సమర్పించిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న జిల్లా అధ్యక్ష పదవిని భర్తీ చేయడానికి తాడేపల్లి పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నారు. చీరాల నుంచి పోటీ చేసి ఓటమి పాలైన కరణం వెంకటేశ్ వైపు ఇటీవల జరిగిన జిల్లా నేతల సమావేశంలో జగన్ మొగ్గు చూపగా, ఆ ప్రతిపాదనను బుధవారం నాటి భేటీలో వారు తిరస్కరించినట్లు సమాచారం. దీంతో మధుసూదనరెడ్డి పేరు తెరమీదకు వచ్చింది. ఈయన మొన్నటి ఎన్నికల్లో బాపట్ల వైసీపీ సీటు కోసం సర్వశక్తులు ఒడ్డారు. కానీ ఆయనను కాదని సిట్టింగ్ ఎమ్మెల్యే కోన రఘుపతికే వైసీపీ అధిష్ఠానం సీటు కేటాయించగా ఎన్నికల్లో ఆయన చిత్తుగా ఓడిపోయిన సంగతి విదితమే. వైసీపీలో ఉన్న నేతలెవరూ జిల్లా పగ్గాలు అందుకోవడానికి సుముఖత చూపకపోవడంతో మొన్నటి ఎన్నికల్లో సీటు ఆశించి భంగపడ్డ మధుసూదనరెడ్డికి పగ్గాలు ఇవ్వనున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో రానుందని తెలుస్తోంది.

ముగిసిన రాష్ట్ర ఖోఖో బాలుర జట్టు శిక్షణ


క్రీడా దుస్తులు అందిస్తున్న ప్రిన్సిపాల్ ఉషారాణి, నేతలు

పంగులూరు, సెప్టెంబరు 25: జాతీయ స్థాయి బాలుర ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టు శిక్షణ బుధవారం ముగిసింది. పంగులూరు ఎంఎస్.ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ అకాడమీ పర్యవేక్షణలో బాలుర జట్టుకు అంతర్జాతీయ క్రీడాకారుడు పి.శివారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కోచ్ పి.పౌల్ పది రోజులుగా శిక్షణ ఇచ్చారు. జట్టు 28 నుంచి అక్టోబరు 3 వరకు జార్ఖండ్‌లోని షిండిగా పట్టణంలో జరిగే జాతీయస్థాయి అండర్ 14 ఖోఖో బాలుర పోటీల్లో పాల్గొంటుంది. కృష్ణా జిల్లా ఎలమూరు ఉన్నత పాఠశాలలో బాలికల రాష్ట్ర జట్టుకు శిక్షణ ఇచ్చినట్లు ఖోఖో అసోషియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. ఈ జట్లకు మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం వారి తనయులు సీతారామిరెడ్డి, న్యాయవాది రవీంద్రనాథ్‌రెడ్డి, మనవలు ప్రియదర్శినిరెడ్డి 50 వేల విలువ చేసే క్రీడా దుస్తులను సమకూర్చగా కళాశాల ప్రిన్సిపాల్ మేకల ఉషారాణి, టీడీపీ నేత రావూరి రమేష్ క్రీడా దుస్తులను అందచేశారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో రోటరీ ప్రతినిధి వీరరాఘవయ్య, జాగర్లమూడి సుబ్బారావు, ఆర్వీ సుబ్బారావు, కోచ్‌లు శివారెడ్డి, పౌల్, జిల్లా అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, కాశీవిశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర బాలుర జట్టు: జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే బాలుర జట్టును రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి బుధవారం ప్రకటించారు. జట్టులో డి.బాజీవలి, వి.సాగర్, కె.వెంకటసాయి, ఎ.శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు(ప్రకాశం), పి.జ్యోతిరాము(అనంతపురం), ఎన్.భవానీశంకర్(కృష్ణా), ఎస్.వీరేంద్ర(తూ.గో.), బి.రామన్‌పాల్(గుంటూరు), ఆర్.బాలాజీ (కర్నూల్), శృతిక్‌సాయి(విశాఖ), బద్రీనాథ్(చిత్తూరు), ఎం.గౌతమ్(నెల్లూరు) ఉన్నారు. జట్టుకు కోచ్‌లుగా పి.శివారెడ్డి, పి.పౌల్, మేనేజర్‌గా షేక్ అహమ్మద్ వ్యవహరిస్తారని తెలిపారు.

వరద సాయం విడుదల

- 33,586 మంది రైతులకు సాయం
- పంట నష్ట పరిహారం పెంచి ఖాతాల్లో జమ

బాపట్ల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరదలకి తీవ్రంగా నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. సాయంత్రం నుంచే రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్ము జమ అవుతుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో హెక్టారుకు రూ.17,000 ఉండే సాయాన్ని రూ.25,000కు పెంచి ప్రభుత్వం విడుదల చేస్తోంది. బాధితుల జాబితా ఆధారంగా దాదాపు 480 మంది బ్యాంకు ఖాతాలు ఆధార్‌తో అనుసంధానం కాలేదని రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా అధికారులకు సమాచారం అందింది. దీంతో సాంకేతికపరమైన సమస్యలను పరిష్కరించి బాధితులైన ప్రతి ఒక్కరి ఖాతాల్లో సొమ్ము జమ అయ్యేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 33,586 మంది రైతులు పంట నష్ట పరిహారం అందుకోనున్నారు. ఇందులో వ్యవసాయ పైర్లకు సంబంధించి 44,652 ఎకరాలకు రూ.44.62 కోట్లు, ఉద్యాన పంటలు 8,678 ఎకరాలకు రూ.13.70 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా విపత్తు వచ్చిన రెండు వారాల వ్యవధిలోనే ఇన్‌పుట్ సబ్సిడీని ఖాతాల్లో జమ చేయడంతో పాటు అందించే పరిహారాన్ని గతంతో పోలిస్తే పెంచి ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ముంపునకు గురైన ప్రతి ఇంటికీ రూ.10,000

లంక గ్రామాల్లో 7,970 ఇళ్లు నీట మునిగినట్లు యంత్రాంగం లెక్క తేల్చింది. వీటికి సంబంధించి ప్రతి ఒక్క ఇంటికీ నష్ట పరిహారంగా రూ.10,000 విడుదల చేయనుంది. పశువుల పాకలు 438 వరకు నీటిలో మునిగినట్లు గుర్తించారు. వీటికి ఒక్కో పాకకు రూ.5,000 పరిహారంగా ఇవ్వనున్నారు. నీళ్లలో మునిగి 809 ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయని లెక్క తేల్చిన యంత్రాంగం వీటికి ఒక్కో బైక్‌కి రూ.3,000 సాయం ప్రభుత్వం అందించనుంది. ఆటోలు 38 వరకు దెబ్బతిన్నాయని ఒక్కోదానికి రూ.10,000, పది పశువులు మరణించగా ఒక్కో దానికి రూ.25,000 చొప్పున నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. మత్స్యకారులకు సంబంధించిన 33 వలలు దెబ్బతిన్నాయని, 369 హెక్టార్లలో రొయ్యలసాగు దెబ్బతినడం వల్ల 369 మంది రైతులకు నష్టం వాటిల్లిందని ఇందుకు సంబంధించి రూ.65 లక్షల పరహారం బాధితుల ఖాతాల్లో జమ చేయనుంది.



నా దృష్టిలో... వేడుక అంటే ఇదే

నటి శోభితా ధూళిపాళ, నాగచైతన్య ఇటీవలే నిశ్చితార్థం చేసుకున్న సంగతి విదితమే. ఎంతో సింపుల్‌గా జరిగిన ఈ ఎంగేజ్‌మెంట్ గురించి ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ వేడుకను గ్రాండ్‌గా చేసుకోవాలని ముందుగా ప్లాన్ చేయలేదు. ఇలా ఉండాలి.. అలా ఉండాలి అని కలలు కనలేదు. జస్ట్.. జీవితంలో అతి ముఖ్యమైన ఆ మధుర క్షణాలని ఆస్వాదించాలని అనుకున్నాను. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా ఇలాంటి వేడుకలు జరగాలని కోరుకునేదాన్ని. ఇది ఇలాగే జరిగింది. కాబట్టి ఈ వేడుక నిరాడంబరంగా జరిగిందని అనుకోవట్లేదు. నా వరకూ ఇదో పర్ఫెక్ట్ పద్ధతిలో సాగిన వేడుక" అని చెప్పారు.

ఒక్క రాత్రిలో జరిగే కథ



ఫీల్‌గుడ్ ప్రేమకథా చిత్రం '96'తో అందరినీ విశేషంగా ఆకట్టుకున్న దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సత్యం సుందరం'. కార్తి, అరవింద స్వామి ప్రధాన పాత్రలు పోషించారు. సూర్య, జ్యోతిక నిర్మించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా దర్శకుడు సి. ప్రేమ్‌కుమార్ మీడియాతో ముచ్చటించారు. "ఇదో బ్యూటిఫుల్ ఫ్యామిలీ డ్రామా. ఈ సినిమాకు కార్తి, అరవింద్ స్వామి బిగ్గెస్ట్ స్ట్రెంగ్త్. వారిద్దరూ అంగీకరించకుంటే.. ఈ ప్రాజెక్ట్‌ను మొదలెట్టేవాణ్నే కాదు. ఇది ఒక్క రాత్రిలో జరిగే కథ. సక్సెస్‌ను, ఫెయిల్యూర్‌ని నేను పట్టించుకోను. సినిమా చేసేటప్పుడు వచ్చే సంతృప్తి మాత్రమే ముఖ్యం. ఈ సినిమా విషయంలో చాలా సంతోషంగా ఉన్నాను. ప్రొడ్యూసర్స్ సూర్య, జ్యోతిక మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు. టెక్నికల్‌గా సినిమా ఉన్నతంగా ఉంటుంది. గోవింద్ వసంత ఇచ్చిన సంగీతం అద్భుతంగా ఉంటుంది. తెలుగు ప్రేక్షకులను కచ్చితంగా అలరించే సినిమా ఇది" అని చెప్పారు.



నేరస్థుల పాలిట యముడు

'జై భీమ్' ఫేమ్ టీజే. జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (ద హంటర్). ఇందులో అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషించారు. 33 ఏళ్ల తర్వాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. తాజాగా, రజనీ పాత్రను పరిచయం చేస్తూ మేకర్స్ ఓ ప్రివ్యూను విడుదల చేశారు. ఇందులో నేరస్థుల పాలిట యముడిగా.. ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా.. ఆయన పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో హింటిచ్చారు. అలాగే, సినిమాలోని ముఖ్య పాత్రధారుల్ని ఈ వీడియోలో పరిచయం చేశారు. దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది.

ఆ వీధికి గాయకుడు బాలు పేరు

- సీఎం స్టాలిన్ ఉత్తర్వులు



గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (ఎస్పీబీ) వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్వాంతన చేకూర్చే కబురందించారు. బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కోరిక మేరకు స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్ మొదటివీధి పేరును మార్చేందుకు స్టాలిన్ అంగీకరించారు. ఆ మేరకు బుధవారం సాయంత్రం ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం యేళ్ల తరబడి నివసించిన కామదార్‌నగర్ ఫస్ట్‌స్ట్రీట్ పేరును 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా మార్చుతున్నట్లు ప్రకటించారు. ఎస్పీబీ భౌతికంగా లేకపోయినా వివిధ భాషల్లో ఆయన పాడిన పాటల ద్వారా అభిమానుల మనస్సుల్లో చిరంజీవిగా సుస్థిరంగా నిలిచి ఉంటారని స్టాలిన్ ఈ సందర్భంగా కొనియాడారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)


దేవర టికెట్ ధరల పెంపు 10 రోజులే



జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా టికెట్ల ధరల పెంపును 10రోజులకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు ఉత్తర్వులు ఇస్తున్నామని పేర్కొంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి. శివకుమార్ రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ నెల 27న విడుదల కానున్న దేవర సినిమా ప్రత్యేక ప్రదర్శనలతో పాటు టికెట్ ధరలను పెంపునకు అనుమతిస్తూ నిబంధనలకు లోబడి టికెట్ ధరలు నిర్ణయించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది శివప్రసాద్ రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 13 ప్రకారం సినిమా విడుదలైన నాటి నుంచి పదిరోజుల పాటు మాత్రమే టికెట్ ధరల పెంపునకు వెసులుబాటు ఉందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వం జారీ చేసిన మెమోపై స్పష్టతనిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి, చిత్ర నిర్మాతకు నోటీసులు జారీ చేసింది. విచారణను వారంరోజులకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి వాదనలు వినిపిస్తూ.. టికెట్ ధరల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమోలో పెంపు ఎన్ని రోజులో ప్రస్తావించలేదన్నారు. వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

కేరళలో ముగించారు



శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('శర్వా 37'- వర్కింగ్ టైటిల్) కీలక షెడ్యూల్ పూర్తయింది. పది రోజుల పాటు కేరళలో జరిగిన షెడ్యూల్‌లో పాట, ఫైట్ సీక్వెన్స్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ చిత్రంలో శర్వానంద్‌కు జంటగా సాక్షి వైద్య, సంయుక్త నటిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: జ్ఞానశేఖర్ వీఎస్

నటి ఊర్మిళ విడాకులు



'రంగీలా, భారతీయుడు' లాంటి హిట్ చిత్రాలతో ప్రేక్షక హృదయాలను కొల్లగొట్టారు నటి ఊర్మిళా మతోండ్కర్. కశ్మీర్‌కు చెందిన వ్యాపారవేత్త మోసిన్ అక్తర్ మీర్‌ను ఆమె 2016లో పెళ్లాడారు. అయితే ఇప్పుడు వీరి వైవాహిక జీవితం ఒడిదుడుకులు ఎదుర్కొంటోందనీ, త్వరలోనే ఇద్దరూ విడిపోబోతున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఊర్మిళ నాలుగు నెలల క్రితమే విడాకుల కోసం ముంబై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

ఇన్ ప్రోగ్రెస్



విభిన్నంగా 'క'

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క'. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌తో సుజిత్, సందీప్ దర్శకులుగా పరిచయమవుతున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తయిందనీ, ఈ చిత్ర నిర్మాణం తమకు మధురమైన అనుభూతులు మిగిల్చిందనీ, జీవితాంతం గుర్తుండిపోయే అనుభవాలను ఇచ్చిందనీ వారు పేర్కొన్నారు. సినిమా సాధించే హిట్ కోసం ఎదురుచూస్తున్నామని సుజిత్, సందీప్ చెప్పారు. టైటిల్‌కు తగ్గట్టుగానే సినిమా కూడా విభిన్నంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ విడుదల చేస్తున్నారు..

ఆ శత్రువుని వెంటేసుకుని పుడతాడు



'మనిషి పుట్టడంతోనే జీవితం అనే శత్రువుని వెంటేసుకుని మరీ పుడతాడు. దాని మీద గెలిచినోడే గొప్పవాడవుతాడు. ఓడినోడు మధ్యలోనే..' అనే డైలాగ్‌తో మొదలయ్యే 'కలి' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ప్రిన్స్, నరేశ్ అగస్త్య ఇందులో హీరోలుగా నటించారు. శివశేషు దర్శకత్వంలో లీలా గౌతమ్ వర్మ నిర్మించారు. అక్టోబర్ నాలుగున సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు చెప్పారు. కష్టాలతో ఆత్మహత్య చేసుకోవాలనుకునే శివరామ్ (ప్రిన్స్) ఇంటికి అపరిచిత వ్యక్తి (నరేశ్ అగస్త్య) వస్తాడు. అతను వచ్చాక శివరామ్ జీవితంలో ఎదురైన అనూహ్య సంఘటనలు ఏమిటన్నవి ఆసక్తికరంగా ఉంటాయని దర్శకుడు శివశేషు చెప్పారు.

వారణాసి నేపథ్యంలో



శివ తత్వాన్ని వివరిస్తూ వారణాసి బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకుంటున్న 'లైఫ్' చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పవన్ కేతరాజు దర్శకుడు. కిశోర్ రాఠి, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. 'ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. హీరో తండ్రి పాత్రలో ఎస్పీ చరణ్ నటించారు. నవాబ్ షా కీలక పాత్ర పోషించారు. శ్యామ్ కె నాయుడు ఫొటోగ్రఫీ, మణిశర్మ సంగీతం ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు చెప్పారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు.

అమరావతికి ఆహ్వానం



శివ కంఠమనేని, ధన్యా బాలకృష్ణ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతోన్న చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. చిత్రీకరణ మొదలైంది. లైట్ హౌస్ సినీ మేజిక్ పతాకంపై కేఎస్ శంకర్ నిర్మిస్తున్నారు. జి. వెంకట కృష్ణన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎస్తేర్, హరీష్, భద్రం కీలకపాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: విష్ణు భరద్వాజ్, సినిమాటోగ్రఫీ: ప్రభాకర్ రెడ్డి

సస్పెన్స్ థ్రిల్లర్



కృష్ణసాయి, మీనాక్షి జైస్వాల్ జంటగా రూపుదిద్దుకున్న 'జ్యూయెల్ థిఫ్' చిత్రం సెన్సార్ పూర్తయింది. ప్రేమ, అజయ్, పృథ్వీ, శివారెడ్డి తదితరులు నటించిన ఈ సినిమాను పీఎస్ నారాయణ దర్శకత్వంలో మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'ఇదో సస్పెన్స్ థ్రిల్లర్. యువతకు బాగా నచ్చుతుంది. శ్రీలేఖ అందించిన పాటలు ఆకట్టుకుంటాయి. యాక్షన్ పార్ట్ హైలైట్ అవుతుంది' అని చెప్పారు.

ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో షార్ట్ టర్మ్ కోర్సులు



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్- షార్ట్ టర్మ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.
- వెబ్‌సైట్: ftii.ac.in

బేసిక్ కోర్స్ ఇన్ డిజిటల్ ఫిల్మ్ మేకింగ్

కోర్సు వ్యవధి అయిదు రోజులు. మొత్తం 45 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. నవంబరు 4 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం ఆరోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఉండాలి. ఈ కోర్సులో ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ లాంగ్వేజ్ అండ్ స్టోరీ టెల్లింగ్ టెక్నిక్స్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, పోస్ట్ ప్రొడక్షన్, ఆర్కైవల్ టెక్నిక్స్ తదితర అంశాలు బోధిస్తారు.
- కోర్సు ఫీజు: రూ.7000
- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 14

ఫౌండేషన్ కోర్స్ ఇన్ స్క్రీన్‌ప్లే రైటింగ్

కోర్సు వ్యవధి పదకొండు రోజులు. మొత్తం 24 సీట్లు ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నవంబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో షార్ట్ ఫిల్మ్ స్ట్రక్చర్, రైటింగ్ ఫర్ స్క్రీన్‌ప్లే, టైమింగ్ ఇన్ సినిమా, అరిస్టాటిల్ పొయిటిక్స్ ఫర్ స్క్రీన్ రైటర్స్, సీన్ కన్‌స్ట్రక్షన్, బిల్డింగ్ ఆఫ్ క్యారెక్టర్స్, మిస్టరీ/సస్పెన్స్/సర్‌ప్రైజ్/ఐరనీ టూల్స్, డెవలపింగ్ షార్ట్ ఫిల్మ్ స్టోరీ అండ్ స్క్రీన్‌ప్లే తదితర అంశాలు బోధిస్తారు. నవంబరు 11 నుంచి ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు వరకు తరగతులు నిర్వహిస్తారు.
- కోర్సు ఫీజు: రూ.17,500
- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 21

బేసిక్ కోర్స్ ఆన్ స్మార్ట్‌ఫోన్ డాక్యుమెంటరీ

కోర్సు వ్యవధి ఎనిమిది రోజులు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. ఈ కోర్సులో స్మార్ట్‌ఫోన్‌తో ఫిల్మ్ మేకింగ్, ఎడిటింగ్ విధానాలు; క్వాలిటీ వీడియోలు తీయడం; ఫోన్‌ను వీడియో కెమెరాగా

దిక్సూచి

DIKSUCHI

వినియోగించడం; సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవిధంగా డాక్యుమెంటరీలు, షార్ట్ వీడియోలు తీయడం; డాక్యుమెంట్ మెమొరీస్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 20 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.
- కోర్సు ఫీజు: రూ.9,800
- దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

బేసిక్ యాక్టింగ్ వర్క్‌షాప్

ఈ కోర్సుని పిల్లలకు ఉద్దేశించారు. దీని వ్యవధి పదకొండు రోజులు. రోజుకు రెండు బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు మరో బ్యాచ్ నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 25 చొప్పున మొత్తం 50 సీట్లు ఉన్నాయి. కనీసం మూడో తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎనిమిది నుంచి పన్నెండేళ్ల మధ్య వయసున్న పిల్లలు ఉదయం బ్యాచ్‌కు, పదమూడు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసున్నవారు సాయంత్రం బ్యాచ్‌కు హాజరు కావాలి. ఈ కోర్సులో థియేటర్ గేమ్స్, ఇంప్రూవైజేషన్, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, ఇమాజినేషన్, నవరసాలు, సీన్‌వర్క్, వాయిస్ అండ్ బ్రీతింగ్, అవేర్‌నెస్, మెమొరీ, కెమెరా వర్క్, ఆడిషన్ టెక్నిక్స్, ఆడిషన్ ప్రాక్టీస్, మ్యూజిక్ బేస్డ్ ఇమాజినేషన్ తదితర అంశాలు నేర్పిస్తారు. అక్టోబరు 29 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.
- కోర్సు ఫీజు: రూ.10,000
- దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 7

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్(పీహెచ్‌డీ)-1-2025'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడర్న్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా రెండు రౌండ్లు ఉంటాయి. నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.

రీసెర్చ్ విభాగాలు: సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ, కంప్యూటేషనల్ బయాలజీ, డిసీజ్ బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ మైక్రో బయాలజీ, ఇమ్యూనాలజీ.

అర్హతలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పయిర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్‌ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్‌ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్‌ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్‌ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-బీ కేటగిరీ కింద జేఆర్‌ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ(నెట్) ద్వారా ఎల్‌ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 11
- వెబ్‌సైట్: www.cdfd.org.in

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్) - ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్ ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ & పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 20
- వెబ్‌సైట్: doms.iitm.ac.in

అనారోగ్యంతో పోలీసు జాగిలం ఫాక్సీ మృతి


పోలీసు జాగిలం ఫాక్సీకి నివాళులర్పిస్తున్న ఎస్పీ తుషార్ డూడి, పోలీసు అధికారులు

బాపట్ల, సెప్టెంబరు 25: బాపట్ల జిల్లా భద్రతా విభాగంలో 2022 నుంచి విశేష సేవలందించిన పోలీసు ట్రాకర్ జాగిలం ఫాక్సీ అనారోగ్యంతో మృతి చెందింది. 5.3 సంవత్సరాల వయస్సు కలిగిన ఫాక్సీ మృతిపై ఎస్పీ తుషార్ డూడి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం డాగ్ కెన్నెల్ భవనం వద్ద ఫాక్సీ కళేబరానికి పుష్పాంజలి ఘటించారు. గౌరవవందనం చేసి ఘనంగా నివాళులర్పించారు. పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసులకు ట్రాకర్ విభాగంలో 2 ఏళ్లపాటు విశేష సేవలందించిందనీ, ఫాక్సీ జాగిలం మృతి చెందటం బాధాకరమన్నారు. పోలీసు కుటుంబ సభ్యుల్లో ఒకరిగా ఫాక్సీ జాగిలంను భావించామన్నారు. నేరాలు ఛేధించటంలో చురుగ్గా, సమర్ధవంతంగా పని చేసిందన్నారు. డాబర్‌మెన్ ఆడజాతికి చెందిన ఫాక్సీ జాగిలం 8 నెలలపాటు మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో ట్రాకర్ విభాగంలో శిక్షణ పొందిందన్నారు. 2020 మార్చి 31న శిక్షణ పూర్తి చేసుకొని ఉమ్మడి గుంటూరు జిల్లా రూరల్ విభాగంలో విధులు నిర్వహించిందన్నారు. ఆ సమయంలో మంగళగిరిటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రేప్ అండ్ మర్డర్ కేసును ఛేధించటంలో కీలకంగా వ్యవహరించిందన్నారు. 2021లో మంగళగిరిలో జరిగిన 27వ బ్యాచ్ రిఫ్రెష్ ట్రైనింగ్‌లో ట్రాకర్ విభాగంలో మొదటి స్థానం పొంది మెడల్ సాధించిందన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ యు.ఏడుకొండలు జాగిలానికి హ్యాండ్లర్‌గా వ్యవహరించారన్నారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, ఏఆర్‌డీఎస్పీ చంద్రమోహన్, అడ్మిన్ ఆర్‌ఐ షేక్.మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్‌ఐ శ్రీనివాస రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

గుంటూరు మీదగా భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాబోయే దసర, దీపావళి పండగల సెలవుల దృష్ట్యా గుంటూరు మీదగా భువనేశ్వర్, యశ్వంత్‌పూర్‌కు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 02811 భువనేశ్వర్ - యశ్వంత్‌పూర్ ప్రత్యేక రైలు అక్టోబరు 5, 12, 19, 26, నవంబరు 2, 9, 16, 23, 30(ప్రతీ శనివారం) తేదీలలో రాత్రి 7.15కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35కి గుంటూరు, 9.20కి నరసరావుపేట, ఆదివారం అర్ధరాత్రి దాటాక 12.15కి యశ్వంత్‌పూర్ చేరుకొంటుంది. నంబరు 02812 యశ్వంత్‌పూర్ - భువనేశ్వర్ ప్రత్యేక రైలు అక్టోబరు 7, 14, 21, 28, నవంబరు 4, 11, 18, 25, డిసెంబరు 2 తేదీల్లో(ప్రతీ సోమవారం) వేకువజామున 4.30 గంటలకు బయలుదేరి రాత్రి 6.29కి నరసరావుపేట, 7.20కి గుంటూరు మంగళవారం మధ్యాహ్నం 12.15కి భువనేశ్వర్ చేరుకొంటుందని తెలిపారు.

నేటి నుంచి జిల్లా జట్ల ఎంపికలు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 25: ఉమ్మడి జిల్లాలో ఈనెల 26 నుంచి వివిధ క్రీడాంశాల్లో జిల్లా జట్ల ఎంపికలు జరుగుతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి మెల్లంపూడి రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న సెపక్ తక్రా అండర్ 14, అండర్ 17 బాలబాలికల విభాగాలకు జడ్పీ స్కూల్ నందిగామ(సత్తెనపల్లి)లో నిర్వహిస్తారు. 27న అథ్లెటిక్స్ ఎంపికలు జడ్పీ స్కూల్ నంబూరులో అండర్ 14, అండర్ 17 బాలబాలికల ఎంపిక జరుగుతుంది. 28న బాక్సింగ్ అండర్ 14, అండర్ 17 బాల బాలికల విభాగాలలో ఏఎంజీ హైస్కూల్ చిలకలూరిపేటలో, బాస్కెట్‌బాల్ అండర్ 14, అండర్ 17 బాలురుకు మాత్రమే ఏఎంజీ హైస్కూల్ చిలకలూరిపేటలో, 28న వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ అండర్ 17, అండర్ 19 విభాగాల్లో బాల బాలికలకు డీఎస్ఏ స్టేడియం తెనాలిలో నిర్వహిస్తారని తెలిపారు. క్రీడాంశాల్లో పాల్గొనే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, ఆధార్, పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

శీలంవారివీధిలో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, సెప్టెంబరు 25: కొత్తపేట శీలంవారి వీధిలో మురళి శ్రీనివాసరావు (54) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి అనారోగ్యం, ఆదరణ కరవవ్వడమేనని పోలీసులు తెలిపారు. శ్రీనివాసరావు మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చి విడాకులు తీసుకున్నారు. ఇద్దరు కుమార్తెలు తల్లి వద్దే ఉంటున్నారు. శ్రీనివాసరావు మరో వివాహం చేసుకోగా ఆమెకు ముగ్గురు కుమార్తెలు సంతానం కలిగారు. వారిద్దరి మధ్య కూడా మనస్పర్ధలు రావడంతో విడిపోయారు. శ్రీనివాసరావు గతంలో హైదరాబాద్, గుంటూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేసేవాడు. ఆయనకు మధుమేహ వ్యాధి ఉండటంతో ఇటీవల కాలుకు దెబ్బతగిలి నడవలేక మంచానికి పరిమితమయ్యాడు. ఈ క్రమంలో తన అన్న భోజనం పెడుతుండే వాడు. ఆరోగ్యం దెబ్బతినడం, కుటుబ సభ్యుల నిరాదరణ వంటి కారణాలతో మనస్తాపానికి గురై సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బదిలీల్లో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం

● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధికారులు


డిప్యూటీ సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న అంధ ఉద్యోగి ఇళయరాజా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25: గుంటూరు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న ఒక అధికారికి చూపు బాగానే కనిపిస్తుంది. అయినా ఆయనకు చూపు లేదన్న పేరుతో గుంటూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో చోటు కల్పించారు. అందుకోసం నిబంధనలు, జీవోలను అడ్డం పెట్టారు. పొన్నూరు మండలం నిడుబ్రోలు జెడ్పీ పాఠశాలలో అటెండర్‌గా పనిచేసే బత్తుల ఇళయరాజా నూరుశాతం అంధ ఉద్యోగి. ఆయన్ను దూరంలోని చింతలపూడికి బదిలీ చేశారు. గుంటూరు జిల్లా పరిషత్ ఉద్యోగుల బదిలీల్లో ఇటువంటి ఉదంతాలు తరుచూ జరుగుతున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫార్సు లేఖలను తుంగలో తొక్కి పోస్టింగ్‌లు ఇచ్చారన్న ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం కూడా చాలా మంది ఉద్యోగులు ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇచ్చినా తమకు అన్యాయం చేశారని ఆరోపిస్తూ జెడ్పీ కార్యాలయానికి వచ్చారు. వినుకొండ నియోజకవర్గంలోని ఈపూరు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పి.రవికుమార్‌ను రొంపిచర్ల మండలానికి బదిలీ చేశారు. రవికుమార్‌ను ఈపూరులోనే కొనసాగించాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు లేఖ ఇచ్చారు. అంతేకాకుండా రవికుమార్ ఎన్‌జీవో అసోసియేషన్‌లో కూడా ఉన్నారు. అయినా బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు.

అన్ని లేఖల పరిస్థితి అంతే...

పి.వెంకట రాజారాం కారంపూడి ఎంపీడీవో కార్యాలయంలో టైపిస్టుగా పని చేస్తున్నారు. ఆయన్ను జెడ్పీలోని పంచాయతీరాజ్ కార్యాలయానికి బదిలీ చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే లేఖ ఇచ్చారు. మరో ముఖ్యమైన నేత కార్యాలయం నుంచి కూడా సిఫార్సు చేశారు. ఆ విజ్ఞప్తిని పూర్తిగా బుట్ట దాఖలు చేశారు. సదరు ఉద్యోగి ముఖ్యనేత కార్యాలయంలో ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా జెడ్పీ బదిలీల్లో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు లు వెళ్లాయి. కొందరు ప్రజాప్రతినిధులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

అక్టోబర్ 2 వరకు ఉండాల్సిందే..

జెడ్పీ బదిలీల్లో కీలకంగా ఉన్న డిప్యూటీ సీఈవో మోహన్‌రావు నెల్లూరుకు బదిలీ అయిన నేపథ్యంలో బుధవారం రిలీవ్ అయ్యేందుకు సిద్ధ పడ్డారు. అయితే కలెక్టర్ కార్యాలయం నుంచి రిలీవ్ చేయవద్దని ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. అక్టోబర్ 2 తర్వాత రిలీవ్ చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

చిన నారాయణమ్మకు ఘన నివాళి

● పెద్దకర్మకు హాజరైన ప్రముఖులు


చిన నారాయణమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు, మంత్రులు, ఎంపీలు, శాసనసభ్యులు, ప్రముఖులు

చిలకలూరిపేట, సెప్టెంబరు 25: స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు మాతృమూర్తి చిన నారాయణమ్మ పెద్దకర్మను పురస్కరించుకుని పలువురు మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు బుధవారం చిలకలూరిపేటకు తరలివచ్చారు. ప్రత్తిపాటి గార్డెన్స్‌లో చిన నారాయణమ్మ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. చిన నారాయణమ్మ కుమారుడు ప్రత్తిపాటి పుల్లారావు, కోడలు వెంకటకుమారితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీవీ ఆంజనేయులు, బూర్ల రామాంజనేయులు, చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, చింతమనేని ప్రభాకర్, తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాసరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్దన్, మాజీ ఎంపీ కంభంపాటి రామమోహనరావు, మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, మక్కెన మల్లికార్జునరావు, బొల్లినేని వెంకటరామారావు, నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ, దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సినీ నిర్మాత, నటుడు కొల్లా అశోక్‌కుమార్, సహా పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. చిన నారాయణమ్మ పెద్దకర్మ సందర్భంగా వేలాదిమందికి ప్రత్తిపాటి గార్డెన్స్‌లో భోజన ఏర్పాట్లు చేశారు. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వేలాదిమంది తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు కార్యక్రమానికి తరలివచ్చారు.

సచ్చిదానందమూర్తి నేటి తరానికి స్ఫూర్తి

● నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు


ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై ఆచార్య గంగాధర్‌రావు, త్రిమూర్తులు

పెదకాకాని, సెప్టెంబరు 25: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పద్మవిభూషణ్ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్‌ను నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు విడుదల చేశారు. కార్యక్రమానికి నందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో జన్మించిన గొప్ప తత్వవేత్త సచ్చిదానందమూర్తి అని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి స్ఫూర్తి అని, నేటి యువత ఆయన సూచించిన రాడికల్ ఫిలాసఫీని అనుసరించాలని సూచించారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రానికి కొత్త భాష్యం చెప్పిన ప్రఖ్యాత తత్వవేత్త అని, భారతీయ తత్వ శాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారని పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతీయ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ భారతీయ తత్వవేత్తల్లో ప్రముఖులైన ఆచార్య కొత్తా సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేయడం గొప్ప విషయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్న షీలా మణి మాట్లాడుతూ కొత్త సచ్చిదానందమూర్తి ఎన్నో గ్రంథాలను ఆంగ్లం, తెలుగు, హిందీలో కూడా రచించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో విద్యార్థులు కొత్త సచ్చిదానందమూర్తి బోధనలను తమ జీవితంలో అనువదించుకోవాలని సూచించారు. వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సీహెచ్. స్వరూపారాణి, ఆచార్య కె.వీరయ్య , ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఏ .ప్రమీలా రాణి, అధ్యాపక సంఘం, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.6 కోట్ల విలువైన భవనం ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్


మంత్రి మనోహర్‌కు రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందజేస్తున్న కస్తూరిభాయ్

తెనాలి రూరల్, సెప్టెంబరు 25: మహిళా మండలి నెలకొల్పి దాని ద్వారా అనేక మందికి సహాయ సహకారాలందిస్తూ వృద్ధాప్యం దరిచేరడంతో సుమారు రూ.6 కోట్ల వివలువజేసే ఆ భవనాన్ని ప్రభుత్వానికి అందించి ముద్దన కస్తూరిభాయ్ గొప్పమనస్సును చాటుకున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పట్టణంలోని కొత్తపేటలో మహిళా మండలి భవనాన్ని బుధవారం ముద్దన కస్తూరిభాయ్ మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ప్రభుత్వానికి రాసి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ ఆమెను అభినందించారు. మనోహర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి కస్తూరిభాయ్ ఎనలేని సేవలందించారన్నారు. రూ.6 కోట్ల విలువజేసే భవనాన్ని మంచి ప్రభుత్వానికి అందించాలన్న ఆకాంక్షతో దానిని కాపాడుకుంటూ వచ్చి, నేడు కూటమి ప్రభుత్వానికి అందించారని, ఆమె మంచి మనస్సుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కస్తూరి భాయ్ మాట్లాడుతూ మహిళా మండలి ద్వారా మహిళల అభ్యున్నతికి కృషి చేశామని తెలిపారు. తనకు వృద్ధాప్యం దరిచేరడంతో మంచి ప్రభుత్వానికి భవనాన్ని రాసి ఇచ్చి మహిళల శ్రేయస్సుకు, మంచి కార్యక్రమాలకు వినియోగించేలా అప్పగించాలని భావించినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భవనాన్ని అప్పగించాలని నిర్ణయించుకుని మంత్రి మనోహర్, అధికారుల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. తొలుత మంత్రి మనోహర్ ఆమెపై పూలు చల్లుతూ భవనంలోకి ఘన స్వాగతం పలికారు. జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, సబ్‌కలెక్టర్ సంజనాసింహ, తహసీల్దార్ గోపాల కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, అధికారులు పాల్గొన్నారు

చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి

●మూడు దొంగతనాలకు పాల్పడింది వేర్వేరు ముఠాలు
●నిందితుల కోసం రంగంలోకి ప్రత్యేక బృందాలు

గుంటూరు, సెప్టెంబరు 25: కేవలం మూడు రోజుల్లో మూడు దొంగతనాలకు పాల్పడి నగరవాసులను కలవరానికి గురిచేసిన కేసుల దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించారు. రెండు చోరీ కేసుల్లో నిందితులను ఇప్పటికే పోలీసులు గుర్తించగా, మూడో కేసులో నిందితులను గుర్తించేందుకు అనుమానితుల జాబితాను తిరగేస్తున్నారు. అపార్టుమెంట్‌లో విశ్రాంత డీఎస్పీ జి. పెంచలనాయుడు ఇంటిలో జరిగిన చోరీకి నిందితులు కారులో వచ్చారు. వారు కింద నుంచి పైవరకు రెండు దఫాలు తిరగడంతో సీసీ కెమెరాల్లో స్పష్టంగా వారి ఆనువాళ్లు కనిపించాయి. ఈ చోరీకి పాల్పడిన ఇద్దరు వరుసకు అన్నదమ్ములని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వీరిలో ఒకరు హైదరాబాదులో ఉంటుండగా, మరొకరు మహారాష్ట్రలో ఉంటున్నట్లు తేలింది. కారులో వచ్చి చోరీకి పాల్పడిన అనంతరం నిందితులు నేరుగా హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి తిరిగి మహారాష్ట్రకు వెళ్లినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో హైదరాబాదులో ఉంటున్న ఓ నిందితుడి కుటుంబ సభ్యులను పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వారు ఇటీవలే ఆ కారును కొనుగోలు చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. వీరు కర్ణాటక వెళ్లాక సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో వారి కదలికలు ప్రశ్నార్ధకంగా మారాయి. దీంతో వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందాలు తరలివెళ్లాయి. వీరు గుంటూరులో చోరీ చేయడానికి ముందు ముంబాయిలోనూ, ఆ తరువాత విశాఖపట్నంలోనూ చోరీ చేసినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. పరిస్థితులను బట్టి వీరు విమానాల్లోనూ తిరుగుతుంటారని తెలిసింది. గతంలో వీరు హైదరాబాద్‌లో ఎనిమిది కిలోల బంగారం చోరీ చేసిన కేసులోనూ పట్టుబడ్డారు. ఎస్వీఎన్ కాలనీలో ఫైనాన్స్ వ్యాపారి శంకర్ ఇంటిలో ఐదు రోజుల క్రితం పట్ట పగలు జరిగిన చోరీ కేసులో కొంత పురోగతి సాధించారు. నిందితుడిని రాజమండ్రికి చెందిన శామ్యూల్‌రాజ్‌గా గుర్తించారు. అయితే ప్రస్తుతం నిందితుడు వేరే రాష్ట్రానికి వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. చోరీకి పాల్పడిన నిందితుడు విజయవాడ వెళ్లి అక్కడ నుంచి రైలులో వేరే రాష్ట్రానికి వెళ్లినట్లు తెలుస్తోంది. నిందితుడు వీధులవెంట తిరుగుతూ, పొలాల్లో నిద్రిస్తూ చోరీలు చేస్తుంటాడని పోలీసులు అంటున్నారు. కేరాఫ్ లేకపోవడంతో ఇతన్ని పట్టుకోవడం కొంత ఇబ్బందిగా ఉంటుందని పోలీస్ వర్గాలు అంటున్నాయి. ఎస్వీఎన్ కాలనీలోని బాంబే డయింగ్ కాలనీలో గల విశ్రాంత తపాలా ఉద్యోగి సూర్యనారాయణ ఇంటిలో జరిగిన చోరీ కేసులో నిందితులను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

వినుకొండ, సెప్టెంబరు 25: దొంగ యాత్రలు, ఆలయ ప్రదర్శనలు చేస్తే చేసిన పాపాలు ఊరికే పోవని, సాక్షాత్తూ కలియుగ వైకుంఠ స్వామికి ద్రోహం చేసిన జగన్‌రెడ్డి ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి తిరుమల తిరుపతిలో చేయరాని పాపాలు చేశారని తెలిపారు. సంప్రదాయాలను తుంగలో తొక్కి కోట్లాది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసి పెద్ద నేరానికి పాల్పడ్డారన్నారు. వైసీపీ పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో అన్య మతస్థులను పెట్టారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని తిరుమలలో దోపిడీ చేశారని ఆరోపించారు. జగన్ రెడ్డి అవినీతి, స్వార్థం కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీశారన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మాట్లాడుతూ కేవలం మూడు నెలల్లోనే వినుకొండ పట్టణం అభివృద్ధి జీవీ ఆంజనేయులు కృషి చేయడం ద్వారా జరుగుతుందని తెలిపారు. పి.వి. సురేష్ పత్తిపూర్ణ, మురళీకృష్ణ యాదవ్, కుంటా కోటిరెడ్డి పాల్గొన్నారు.

వైరల్ ఫీవర్లపై సర్వే

● డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి



గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 25: జిల్లాలో ప్రబలిన కాక్‌టెయిల్ వైరల్ ఫీవర్ల వ్యాప్తిని తెలుసుకొనేందుకు ఎపిడమియాలజికల్ సర్వే చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సంభవిస్తున్న మిక్స్‌డ్ ఫీవర్లలో డెంగీ, చికున్ గున్యా, మలేరియా తదితర జ్వరాలను గుర్తించేందుకు, శాస్త్రీయ పరిష్కారాలను సూచించేందుకు ఈ సర్వే దోహదపడుతుందని ఆమె తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో ఆమె వైరల్ ఫీవర్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. "కాక్‌టెయిల్ వైరస్ కలకలం" శీర్షికన ఈ నెల 24వ తేదీన ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వెలువడిన కథనంపై డీఎంహెచ్‌వో స్పందించారు. బాధితుల్లో పలు రకాల వైరల్ ఫీవర్ లక్షణాలు కనిపిస్తున్నట్లు ప్రచురించగా, వీటిపై అధ్యయనం చేసేందుకు ఆమె చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గుంటూరు వైద్య కళాశాల సామాజిక వ్యాధి నిరోధక విభాగానికి చెందిన వైద్యనిపుణులతో సమావేశమయ్యారు. ఎస్పీఎం హెచ్‌వోడీ డాక్టర్ ఏ.సీతారామ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ్‌కుమార్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ సుగుణరాజు తదితరులు పాల్గొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ వైద్యనిపుణులతో పాటు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఫీవర్ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. పిడిడమియాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, డెమో ఏ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడుగా అంబటి

● పల్నాడు బాధ్యతలు మళ్లీ పిన్నెల్లికే..

గుంటూరు, సెప్టెంబరు 25: సార్వత్రిక ఎన్నికల తరువాత పూర్తి నిస్సత్తువలో ఉన్న వైసీపీకి జిల్లాల అధ్యక్షుల నియామకాలను చేపట్టారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడుగా మాజీ మంత్రి అంబటి రాంబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాలకు పార్టీ పరిశీలకుడుగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా దొంతిరెడ్డి వేమారెడ్డిని నియమిస్తూ జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నేతలతో తాడేపల్లి కార్యాలయంలో మాజీ సీఎం జగన్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రులు విడదల రజనీ, మేకతోటి సుచరిత, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైసీపీ నేతలు మందపాటి శేషగిరిరావు, షేక్ నూరిఫాతిమా, అంబటి మురళి హాజరైయ్యారు.

ఏఎన్‌ఎంలకు ఇతర విధులు కేటాయించొద్దు

గుంటూరు సిటీ, సెప్టెంబరు 25: వైద్య, ఆరోగ్య కార్యక్రమాల్లో నిత్యం పని ఒత్తిడితో ఉంటున్న ఏఎన్‌ఎంలకు ఇతర విధులు కేటాయించవద్దని తెలుగునాడు మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మలినేని భానుమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏఎన్‌ఎంలు సాధారణ టీకాలు, ఫ్రైడే, డ్రైడే, ఆర్‌సీహెచ్, సీజనల్ వ్యాధుల నివారణ కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాల నిర్వహణ, ఎన్‌సీడీసీడీ సర్వే, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. అటువంటి తరుణంలో 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమంలో ఏఎన్‌ఎంలను భాగస్వామ్యం చేయడం దారుణమన్నారు. ఎంపీడీవోలు, గ్రామ కార్యదర్శులు కూడా ఇతర సర్వే పనులు ఏఎన్‌ఎంకు అప్పగిస్తున్నారని అన్నారు. దీనివలన ఫీడర్ క్యాడర్‌కి రావాల్సిన పదోన్నతుల అవకాశాలు తగ్గి ఉద్యోగులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల కు మేలు చేసే 100 శాతం గ్రాస్ శాలరీ జీవోను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులను ఎఫ్‌ఆర్‌ఎస్ పేరుతో ఇబ్బందులకు గురిచేసిందనీ, అందువల్లే ఉద్యోగులు కూటమి ప్రభుత్వం రావాలని కోరుకున్నారని అన్నారు.

800 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం


బియ్యం లారీని తనిఖీ చేస్తున్న రూరల్ ఎస్ఐ గండు కిరణ్

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 25: అర్ధరాత్రి గుంటూరు వైపు వెళ్తున్న లారీని పొన్నూరు రూరల్ పోలీసులు అనుమానంతో ఆపి తనిఖీ చేయగా బియ్యం బస్తాలు ఉన్నాయి. అవి రేషన్ బియ్యంగా అనుమానించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ సీఐ కోటేశ్వరరావు కథనం ప్రకారం మంగళవారం రాత్రి రూరల్ ఎస్సై గండు కిరణ్ గస్తీ నిర్వహిస్తుండగా చింతలపూడి వద్ద అనుమానాస్పదంగా వెళ్తున్న లారీని ఆపి తనిఖీ చేశారు. బాపట్ల నుంచి తెలంగాణలోని ఖమ్మం జిల్లా మదిరకు బియ్యం లోడు చేసుకుని వెళ్తున్నట్లు డ్రైవర్ సమాధానం ఇచ్చాడు. అయితే ఈ బియ్యం రేషన్ బియ్యంగా అనుమానించి పోలీసులు స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయి అధికారులకు సమాచారం అందించారు. సివిల్ సప్లయి డీటీ భువనేశ్వరి లారీలోని బియ్యాని తనిఖీ చేసి నిర్ధారణ కోసం జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అయితే ప్రాథమిక పరిశీలనలో ఈ బియ్యం రేషన్ బియ్యంను రీసైక్లింగ్ చేసినట్టుగా గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి లారీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. లారీలో 25 కిలోల చొప్పున 800 బస్తాల బియ్యం విలువ రూ.10 లక్షల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

న్యూరో విభాగానికి రూ.4 లక్షల విరాళం

గుంటూరు (మెడికల్) సెప్టెంబరు 25: ఏపీ న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాలకు చెరో రూ.2 లక్షల చొప్పున రూ.4 లక్షల విరాళం అందజేసింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, డాక్టర్ వీర్ తారక్‌నాథ్, డాక్టర్ సీహెచ్ శివరామకృష్ణ తదితరులు ఈ విరాళం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఇటీవల గుంటూరులో జరిగిన న్యూరోసైంటిస్ట్‌ల అసోసియేషన్ వార్షికోత్సవ సదస్సు విజయవంతం కావడం వెనుక ప్రభుత్వాస్పత్రి న్యూరాలజీ, న్యూరో సర్జరీ వైద్యనిపుణుల కృషి ఉంది. ఈ నేపథ్యంలో ఆయా విభాగాల అభివృద్ధికి ఈ విరాళం అందజేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. తమకు వచ్చిన రూ.2 లక్షల విరాళంతో న్యూరాలజీ విభాగం వైద్యులు ల్యాప్‌టాప్‌ను కొనుగోలు చేసినట్లు చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

51,039 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 51,149 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,039 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 26,374 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	17000	334	9000	15700
నెంబరు. 5	9000	17000	నెంబరు. 5	9000	11500
273	11500	14000	273	--	--
341	9000	16000	341	9000	16500
4884	12500	13700	4884	13200	15000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18600	తేజ	9000	18700
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	9000	15000
దేవనూరు డీలక్స్	8000	16000	దేవనూరు డీలక్స్	13000	16500
తెల్లకాయలు	5500	11500	తెల్లకాయలు	6500	10600

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

బాపట్ల, సెప్టెంబరు 25 : భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం బీజేపీ సభ్యత్వ మహాభియాన్‌లో భాగంగా పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొమ్మనబోయన మణి యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి వల్లూరి భావన్నారాయణ, నరాలశెట్టి శ్రీనివాసరావు, ముప్పల శ్రీనివాసరావు, ఎస్‌బీఎస్‌జి తిలక్, బ్రహ్మాండం బాలనారాయణ, నక్కా పేరిరెడ్డి, కొండారెడ్డి అనీల్‌కుమార్, చందనం మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

గానగంధర్వ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం : రావూరి

బాపట్ల,సెప్టెంబరు 25 : భారత చలనచిత్ర సంగీత జగత్తులో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ఒక ధ్రువతార, గాన గంధర్వ గాయకుడని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ బుధవారం అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాల్గవ వర్ధంతి సభలో సాహితీభారతి కోశాధికారి ఆదంషఫి, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం నటులే స్వయంగా పాడిన అనుభూతిని ప్రేక్షకులకు కలిగించేవారని అన్నారు. అనంతరం రచయితలు పువ్వాడ వెంకటేశ్వరరావు, కామరాజు కాళిదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, ఎం.జాకబ్ తదితరులు బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు.

క్రీడలలో రాణించటం అభినందనీయం : వేగేశన



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 25 : విద్యార్థులు క్రీడలలో రాణించటం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఇండోనేషియా ఇంటర్నేషనల్ రూరల్ గేమ్స్‌లో పాల్గొని షటిల్ బ్యాడ్మింటన్ అండర్-19, 14 విభాగాలలో ప్రతిభకనబరిచి పతకాలు సాధించిన నందిరాజుతోట విద్యార్థులను బుధవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అభినందించారు. విద్యార్థులు అద్దంకి భువనేశ్వర్, కారుమంచి అభిరాం, ఉప్పాల దత్తాత్రేయ వెంకట్, పి.కృష్ణ, జూనియర్స్ విభాగంలో ఉప్పాల ధర్మా, కర్రి కేశవ, ఆకుల వైభవ్, దేవరకొండ దిలీప్‌కుమార్‌లు మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ, హరిశ్చంద్రప్రసాద్ ఉన్నారు.

దేవదాయ శాఖ ఈవోగా రవికుమార్

బాపట్ల, సెప్టెంబరు 25 : బాపట్ల దేవదాయ శాఖ ఈవోగా ఎస్‌వీ రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఈవో డి.వెంకటేశ్వర్లు బదిలీపై యలమదల వెళ్ళారు.

స్వచ్ఛతాహీ సేవలో వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు

బాపట్ల, సెప్టెంబరు 25 : స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కొత్త బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రం చేశారు. తదుపరి ఆర్టీసీ ప్రయాణికులకు స్వచ్ఛతాహీ సేవ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్, సుధాకర్, బసవయ్య, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆహారవిజ్ఞాన సాంకేతక కళాశాలలో...

పట్టణంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆహారవిజ్ఞాన సాంకేతిక కళాశాలలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్రీడా మైదానాన్ని శుభ్రం చేశారు. ప్లాస్టిక్ పదార్థాలను, చెత్తను, పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను తొలిగించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ విమల బీర, డాక్టర్ బ్లెస్సీ సాగర్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని వలంటీర్లను సమాజ సేవపై ప్రేరేపించారు. కార్యక్రమంలో డాక్టర్ ఫణేంద్రకుమార్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం మొర్రికి ఉచిత వైద్య శిబిరం

బాపట్ల,సెప్టెంబరు 25 : బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారు బుధవారం గ్రహణం మొర్రికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సమగ్రశిక్ష సహిత విద్యావిభాగం బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన ఈ శిబిరానికి జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్ లక్ష్మీకుమారి, ఐఈ కోఆర్డినేటర్ మట్టా జ్యోత్స్న, వైద్య బృందం డాక్టర్ జోషి, డాక్టర్ రాంబాబు, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఏడుగురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు.

కల్తీ జరగలేదని నిరూపించే దమ్ము పొన్నవోలుకు ఉందా : కొల్లా

బాపట్ల, సెప్టెంబరు 25 : తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని నిరూపించే దమ్ము పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి ఉందా అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. జాతీయ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించటంలో నైపుణ్యం, పేరుప్రతిష్ఠలు కలిగిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు వారి ల్యాబ్‌లో టీటీడీ పంపిన నెయ్యి శాంపిల్స్‌లో కల్తీని గుర్తించి ధ్రువీకరణ పత్రం ఇవ్వటం జరిగిందన్నారు. దీనిని కాదనే దమ్ము, ధైర్యం పొన్నవోలుకుగాని, వైసీపీ నాయకులకు గాని ఉంటే ముందుకురావాలని కొల్లా సవాల్ విసిరారు.

సంక్షేమ విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంచుదాం : జేవీవీ

బాపట్ల, సెప్టెంబరు 25 : చెకుముఖి టాలెంట్ టెస్ట్ ద్వారా సంక్షేమ విద్యార్థులలో శాస్త్రీయ అవగాహన పెంచుదామని జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు అన్నారు. పట్టణంలోని ఏవీవీ హైస్కూల్‌లో బుధవారం చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈవో డి.ప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచేందుకు ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వై.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జనార్ధనస్వామి దేవాలయంలో ప్రాయశ్చిత్త దీక్ష

కర్లపాలెం, సెప్టెంబరు 25 : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ అపవిత్రమైన సందర్భంగా కర్లపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో జనార్ధనస్వామి దేవాలయంలో కూటమి సభ్యులు ప్రాయశ్చిత్త దీక్ష చేశారు. బృందావనం శ్రీనివాసచార్యులు, వేదాంతం శ్రీనివాసచార్యులతో జనార్ధనస్వామివారికి విశేష పూజలు నిర్వహించి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, బండ్రెడ్డి రజని, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు సునీత, జనసేనపార్టీ మండల ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్రబాబు, మాజీ సర్పంచ్ బొద్దుకూరి విజయ, మాజీ ఎంపీటీసీ కట్టా సుజాత, నల్లమోతువారి పాలెం గ్రామ అధ్యక్షులు గరిగంటి శ్రీనివాసులు, కారుమూరి అంజనేష్, ఎస్.రాంబాబు, పెనుమెత్స పార్వతి, పెనుమెత్స లీలావతి, భారతి, ముదునూరు సావిత్రి, కళ్ళేపల్లి జాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు అవగాహన

వేమూరు, సెప్టెంబరు 25 : మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకేషనల్ ఎడ్యుకేషన్‌కు చెందిన విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఎంశ్రీ పాఠశాలగా గుర్తింపు పొందిన పాఠశాలలో ఏర్పాటు చేసిన మెకానికల్ కోర్సుకు సంబంధించిన విద్యార్థులకు ద్విచక్ర వాహనంలో భాగాలు, పని తీరు విధానాన్ని సాయిగణేష్ వివరించారు. ఎలక్ట్రానిక్స్ కోర్సుకు సంబంధించి టెక్నిషియన్ మార్కు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనర్స్ పుష్పలత, రాధ పాల్గొన్నారు.

నెల్లూరు కార్పొరేషన్ ఎస్ఈ సంపత్‌కు తాకీదులు

- రేపల్లె ఈఈగా ఉన్నప్పటి అవకతవకలపై ప్రభుత్వం సీరియస్
- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసు

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 25 : నెల్లూరు కార్పొరేషన్ ఎస్ఈగా పని చేస్తున్న టీ.సంపత్ కుమార్ ఎక్కడ పని చేసినా ఆరోపణలు ఎదుర్కోక తప్పడం లేదు. గతంలో రేపల్లె మున్సిపాలిటీ పబ్లిక్ హెల్త్ ఈఈగా పనిచేసేటప్పుడు సీసీ రోడ్ల నిర్మాణంలో తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించి తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు చార్జిమెమోతో కూడిన నోటీసులు జారీ చేసింది. సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చి సదరు కాంట్రాక్టరుకు అదనపు చెల్లింపులు చేశారని, అప్పట్లో ఈయనపైన ఆరోపణలు రాగా ప్రభుత్వం విచారణ జరిపింది. అందులో వాస్తవాలు తేలడంతో ప్రభుత్వ కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఈ నెల 20వ తేదీన నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు అందుకున్న 15 రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆయన తన ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా, ఎస్ఈ సంపత్‌పై నెల్లూరులోనూ పలు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వాటిపై విజిలెన్స్ విచారణ కోరేందుకు కొందరు సిద్ధమవుతున్నారని సమాచారం.



పోతుమర్రు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్



పెదపులుగువారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

రాష్ట్ర పునఃనిర్మాణానికి చంద్రబాబు కృషి

- ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

వేమూరు, సెప్టెంబరు 25 : ఆంధ్రప్రదేశ్‌ను జగన్మోహనరెడ్డి ఐదు సంవత్సరాల కాలంలో చిన్నాభిన్నం చేశారని, కూటమి పాలనలో పునఃనిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. పోతుమర్రులో సర్పంచ్ కూచిపూడి మైనా అధ్యక్షతన బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. హాజరైన ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులు ముందుగా గ్రామంలో పర్యటించి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను ఇళ్ల గోడలపై అంటించారు. అనంతరం జరిగిన సభలో ఎంపీ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలను కాలరాసి పాలన చేసిన జగన్ రాష్ట్రంతో పాటు ప్రజలను కూడా నయవంచన చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రికి తోడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తోడుగా చేతులు కలిపి ప్రణాళికబద్ధంగా ముందుకు నడవటం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ, జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా నష్టపోయిందని, ఈ పరిస్థితులను గట్టెక్కించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. సభలో బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్, ప్రత్యేక అధికారి వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో అనూరాధ, పంచాయితీ కార్యదర్శి శేఖర్, గోపాలరావు, టీడీపీ నాయకులు కూచిపూడి రవి, వి.సుబ్రహ్మణ్యం, కూచిపూడి ప్రసాద్, గోసే రవి, కీర్తి పిచ్చయ్య, గోసే సురేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ టీడీపీ నాయకులు అతిథులను సత్కరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కర్లపాలెం, సెప్టెంబరు 25 : ప్రజాసంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని పెదపులుగువారిపాలెంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో బుధవారం నరేంద్రవర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తూ ప్రజలకు మంచి పాలనందిస్తుందని, వారి అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకుంటుందన్నారు. వచ్చే దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని అమలు చేస్తారన్నారు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు మంచి జరుగుతుందని, వెనక్కి వెళ్ళిన కంపెనీలన్నీ తిరిగి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, ఆర్డీవో రవీందర్, తహసీల్దార్ ఎస్.వెంకటరత్నం, జనసేన మండల అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు నంగు సాంబశివారెడ్డి, నక్కల వెంకటరెడ్డి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, కోమట్ల కృష్ణచలపతిరెడ్డి, ఎంపీటీసీ బాజి, పులుగు సముద్రాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కర్లపాలెం, సెప్టెంబరు 25 : బడుగు, బలహీనవర్గాల ప్రజలందరికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కర్లపాలెం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ అన్నారు. మండలంలోని గణపవరంలో బుధవారం ఉపసర్పంచ్ శ్రీవిద్య అధ్యక్షతన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు గూడూరి విష్ణు, కాకా నాగాంజనేయులు, ఇనగంటి సునీత, అక్కిరెడ్డి రవి, ఈవోపీఆర్డీ ఏలీషాబాబు పాల్గొన్నారు. మండలంలోని పేరలిలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు ఆధ్వర్యంలో ఇదిమంచి ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శి సువర్చల, నాయకులు బుల్లియ్య, ఈవోపీఆర్డీ ఏలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.
- బాపట్ల రూరల్, సెప్టెంబరు 25 : బాపట్ల మండలం వెదుళ్ళపల్లి గ్రామంలో బుధవారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గుడిపల్లి సాంబశివరావు, పార్టీనాయకులు ఇంటింటికెళ్ళి 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్ అంటించి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం మంచిపాలన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుంచాల సుబ్రహ్మణ్యంరెడ్డి, నోడల్ అధికారి, ఎంఈవో ప్రసాదరావు, సర్పంచ్ కుంచాల గోవిందమ్మ, గ్రామ కార్యదర్శి విజయసారధి, చెన్నుపాటి కిషోర్, బండారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 25 : మండలంలోని సంగుపాలెం, కోడూరు గ్రామపంచాయతీలలో మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి భవనం మారుతీశేషమాంబ ఆధ్వర్యంలో బుధవారం 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామసభలలో సంగుపాలెం కోడూరు గ్రామపంచాయతీ సర్పంచ్‌లు ఎనికేపల్లి శివకుమారి, ఐనంపూడి శ్రీనివాసరావులు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకిచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని అన్నారు. మండల తెలుగు మహిళా అధ్యక్షులు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి మాట్లాడుతూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే దశలో మరింత ముందుకెళుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగుపాలెం ఎంపీటీసీ చెన్నుబోయిన గంగయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, సంగుపాలెం కార్యదర్శి బి.సుజాత, సచివాలయ కార్యదర్శి షేక్ రబ్బాని, సచివాలయ ఉద్యోగులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వం సేకరిస్తున్న ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

- జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్

వేమూరు, సెప్టెంబరు 25 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించే దిశలో ఆలోచన చేయాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ కోరారు. మండలంలోని పలు గ్రామాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సభ్యత్వాలను బుధవారం సేకరించారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ సమస్యలను సభ్యత్వ సేకరణ సందర్భంలో తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రావిడెంట్ ఫండ్ బకాయిలను చెల్లించాలని, 2022లో దాఖలు చేసిన నేటికి శాంక్షన్ కాలేదని వెంటనే మంజూరు చేయాలన్నారు. సీపీఎస్ వారికి డీఏ బకాయిలను కూడా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏపీ జీఎల్ఐ బాండ్స్ మెచ్యూర్ కాగా సంబంధిత అమౌంట్ క్రెడిట్ కాలేదని, ఈ సమస్యను కూడా వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట సంఘ సభ్యులు సీతారామయ్య, అపర్ణ, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన యడ్లపల్లి హైస్కూల్

చుండూరు, సెప్టెంబరు 25 : ఉన్నత పాఠశాల విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆటల పోటీలలో యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. యడ్లపల్లి స్కూల్‌లో జరిగిన ఈ పోటీలలో 28 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అథ్లెటిక్స్, షటిల్, యోగాలో అండర్-14, 17 విభాగాల్లో పోటీలు బుధవారం జరిగాయి. ఈ పోటీలలో ఆల్‌రౌండ్ ఓవరాల్ చాంపియన్ షిప్‌ను యడ్లపల్లి క్రీడాకారులు దక్కించుకున్నారు. క్రీడలను రీజనల్ క్రీడాధికారి షేక్ బాషా ప్రారంభించారు. ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కరిముల్లా, ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రావి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు. క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీఈటీ వేమూరు శరత్‌ని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.



అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మినీ వ్యాన్ డ్రైవర్

కొల్లూరు, సెప్టెంబరు 25 : రోడ్డు ప్రమాదంలో మినీ వ్యాన్ డ్రైవర్ గాయపడిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి రేపల్లె సరుకు లోడుతో వెళుతున్న మినీ వ్యాన్ తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో మండల పరిధిలోని దోనేపూడి వద్ద టైరు పంక్చరై చెట్టును ఢీకొంది. మినీ వ్యాన్ రోడ్డు మధ్యలో ఉండటంతో డ్రైవర్ ఇతర వాహనాలకు తెలియజేసేందుకు గుర్తులుగా చెట్ల కొమ్మలు పెట్టే క్రమంలో ఓ లారీ వెళ్లడం, దాని వెనుకే కారు రావడం జరిగిందని, డ్రైవర్‌ను లారీ ఢీకొట్టిందో, కారు ఢీకొట్టిందో స్థానికులు సైతం చెప్పలేకపోతున్నారు. కారు మాత్రం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. మిని వ్యాన్ డ్రైవర్ దాసరి గోపురాజు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మిని వ్యాన్‌లో ఉన్న మరో వ్యక్తి ప్రమాదం జరిగిన విషయాన్ని వ్యాన్ యజమాని మధుకు తెలియజేయడంతో హుటాహుటిన రేపల్లె నుంచి దోనేపూడి చేరుకుని 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్యుని సలహా మేరకు గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు.

అర్హులైన లబ్ధిదారులకు పక్కా గృహాలు నిర్మిస్తాం

రేపల్లె, సెప్టెంబరు 25 : అర్హులైన లబ్ధిదారులకు పక్కా గృహాలను అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి అన్నారు. నిజాంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'మన ఇల్లు మన గౌరవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలిచే దిశగా ముందుకు వెళుతుందన్నారు. స్పెషలాఫీసర్ ఫిషరీస్ జేడీ పి.సురేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గూడులేని అర్హులైన ప్రతి ఒక్కరికి గృహాలను నిర్మించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వర్షపు నీటితో విద్యార్థుల అవస్థలు

రేపల్లె, సెప్టెంబరు 25 : జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలంటూ బీజేపీ రాష్ట్ర నాయకుడు పిన్ని సాంబశివరావు కోరారు. పాలిటెక్నిక్ కళాశాలలో నిలిచిన వర్షపునీటిలో నిలుచుని బుధవారం ఆయన నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రాంగణాలలో వర్షపునీరు నిలవటంతో అటు విద్యార్థులు, ఇటు క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురౌవుతున్నారన్నారు. కళాశాల యాజమాన్యం, పురపాలక సంఘ అధికారులు దృష్టిసారించి తక్షణమే నిలిచిన వర్షపునీటిని మోటార్ల ద్వారా బయటకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలలో వర్షపు నీరు తొలగించాలని కోరుతున్న బీజేపీ నాయకులు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

నగరం, సెప్టెంబరు 25 : మహిళలు, విద్యావంతులైన వారు చేతివృత్తుల్లో నైపుణ్యతను సంపాదించినపుడు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి అన్నారు. సిఫార్డు స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో మహిళలకు టైలరింగ్, హ్యాండ్‌క్రాఫ్ట్‌లో శిక్షణ ముగింపు కార్యక్రమం సందర్భంగా బుధవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఉన్నతస్థితిలో ఉండటానికి కారణం డ్వాక్రా, పొదుపు సంఘాలేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ జాలాది దేవదానం, నాగరాజు, ఆర్గనైజర్ బేతపూడి నాగేంద్రం, వీర్రాజు, కోఆర్డినేటర్ అడుచుమల్లి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కార్పొరేషన్‌లో అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల, సెప్టెంబరు 25 : దివ్యాంగుల కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చన అనేక అవకతవకలకు పాల్పడ్డారంటూ నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్రాధ్యక్షుడు షేక్ కాలేషా బుధవారం జేసీ ప్రఖర్‌జైన్‌కు ఫిర్యాదు చేశారు. అర్చనపై శాఖాపరమైన విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పాఠ్యాంశాలలో సిలబస్ తగ్గించాలని వినతి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 25 : పాఠ్యాంశాలలో సిలబస్ తగ్గించాలని విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో మంగళగిరి జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డికి ఏపీఎస్ఎస్‌టిఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీచర్స్ ఫోరం తరుపున వినతి పత్రం అందజేశారు. కార్యాలయంలో బుధవారం జాయింట్ డైరెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్టు అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు షేక్ సైరా ఉన్నీసా బేగం, ఎం.శేషుబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

కర్లపాలెం, సెప్టెంబరు 25 : కర్లపాలెం పంచాయతీ పరిధిలోని గౌడపాలెంలో బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఉంచిన బైక్ అపహరణకు గురైందని యాజమానికి యేమినేని గోపి కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ రవీంద్రకు ఫిర్యాదు చేశారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు : ఆర్డీవో

కొల్లూరు, సెప్టెంబరు 25 : ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఆర్డీవో హేలాషారోన్ అన్నారు. మండల పరిధిలోని అరవింద వారధి వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు జరిగే ప్రదేశాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీసు అధికారులతో ఆమె మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. సీఐ వీరాంజనేయులు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆమెకు వివరణ ఇస్తూ కృష్ణానది నుంచి ప్రధాన మార్గాల నుంచి కాకుండా ఇతర మార్గాల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారని నియంత్రణ కోసం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని ఏడు ప్రాంతాల్లో వీఆర్వోలు, పోలీసు కానిస్టేబుల్స్‌తో పికెటింగ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీటీ నిరంజన్, ఎస్ఐ ఏడుకొండలు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఆర్డీవో హేలాషారోన్

డెల్టా రైలుకు వేమూరులో స్టాప్ ఇవ్వాలి

వేమూరు, సెప్టెంబరు 25 : సికింద్రాబాద్ నుంచి రేపల్లె వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్ రైలును వేమూరులో ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని బాపట్ల పార్లమెంట్ సభ్యులు కృష్ణప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. డెల్టా ఎక్స్‌ప్రెస్ గతంలో వేమూరులో నిలుపుదల చేసేవారని గత కొన్నాళ్ల నుంచి వేమూరులో రైలు నిలుపుదల లేదని, తెనాలి, చినరావూరు, భట్టిప్రోలు మాత్రమే స్టాఫ్‌లుగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేమూరులో కూడా డెల్టా రైలు ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని వేమూరి శేషుబాబు తదితరులు విన్నవించుకున్నారు. అదేవిధంగా బూతుమల్లి రైల్వే గేటు వద్ద ఎక్కువ సమయం గేటు వేసి వాహనాలు రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై స్పందించిన ఎంపీ కృష్ణప్రసాద్ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి డెల్టా ఎక్స్‌ప్రెస్ వేమూరులో నిలుపుదల చేసే విధంగా, బూతుమల్లి రైల్వే గేటు విషయంపై కూడా అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని చెప్పారు. విజయవాడ నుంచి బాపట్ల వరకు నాలుగో లైన్ ఏర్పాటు గురించి రైల్వే చైర్మన్‌తో చర్చించినట్లు ఎంపీ కృష్ణప్రసాద్ విలేకర్లకు తెలిపారు.

వరద బాధితులకు విద్యార్థులు ఆర్థికసాయం

రేపల్లె, సెప్టెంబరు 25 : ఇటీవల వరదల కారణంగా తీవ్రనష్టం వాటిల్లటంతో విద్యార్థులు దాచుకున్న పాకెట్ మనీని వరదబాధితులకు చేయూతనివ్వాలనే ఉద్దేశ్యంతో రూ.50,555ల చెక్కును మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి సోదరుడు శివప్రసాద్‌కు విరాళం చెక్కును అందిస్తున్న విద్యార్థులు

50 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

కొల్లూరు, సెప్టెంబరు 25 : మండల పరిధిలోని తోకలవానిపాలెం పంచాయతీలో గల కృష్ణనగర్‌లోని 50 కుటుంబాలకు సహృదయ ఫౌండేషన్ సభ్యులు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ సభ్యులు బుధవారం ఈ సాయాన్ని అందజేశారు. గ్రామ సర్పంచ్ టి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, అమెరికాలో స్థిరపడి పేదలకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో సహృదయ ఫౌండేషన్ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.సుబ్బారావు, వాగోలు ఏసు, కృష్ణారావు, బైరాగి పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీఏ విజయబాబు

రేపల్లె, సెప్టెంబరు 25 : ఆధునిక వ్యవసాయంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని రేపల్లె మండల వ్యవసాయాధికారి ఆర్.విజయబాబు అన్నారు. బుధవారం రేపల్లె మండలంలోని పేటేరు, మోర్లవారి పాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయంపై రైతులు మక్కువ చూపితే దిగుబడి ఎక్కువ రాబట్టటంతో పాటు ఖర్చులు తగ్గే పరిస్థితి ఉంటుందన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పుష్పకుమారి, దశరథరామయ్య, వీఆర్‌వో ఎస్.సర్వర్, డీవీ ధనుంజయరావు, ఆరేపల్లి నాగరాజు, వాకా శంకరరావు, శొంఠి నరేంద్రప్రసాద్, వీఏఏలు సుష్మ, కొండలు, రైతులు పాల్గొన్నారు.

- చెరుకుపల్లి, సెప్టెంబరు 25 : ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవరుచుకుని ముందుకు సాగితే ఖర్చులు తగ్గుతాయని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.వాణిశ్రీ అన్నారు. ఆరుంబాక పంచాయతీలో జరిగిన బుధవారం పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను చేసి చూపించారు. కార్యక్రమంలో ఏవో టి.బాలాజీగంగాధర్, ఏఈవోలు వీఏఏలు, పలు గ్రామాల రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.
- కొల్లూరు, సెప్టెంబరు 25 : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల నేలతల్లికి మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని చిలుమూరు, ఈపూరు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ, చిలుమూరులో 170 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారని, మొదట వేసవిలో కాలంలోనే నవధాన్యాలను భూమిలో నాటి తొలకరి వర్షాలతో అవి పెరిగి, పూత దశకు వచ్చిన తరువాత భూమిలో కలియదున్నడం వల్ల నేలకు మంచి బలం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వెటర్నరి వైద్యులు పి.రాజేంద్రప్రసాద్, అసిస్టెంట్ ఎ.మౌనిక, జెడ్‌బిఎన్ఎఫ్ సిబ్బంది భీమరాజు, రామారావు, హార్టికల్చర్ అసిస్టెంట్ వినీత, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.
- పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 25 : రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని డీడీఏ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పోతనకట్టవారిపాలెం, పిట్టువారిపాలెం, భవనంవారిపాలెం, రైతుల సేవా కేంద్రాలలో బుధవారం 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడీఏ విజయలక్ష్మి మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారులు సూచించిన విధంగా సాగుచేసుకోవాలన్నారు. బాపట్ల వ్యవసాయ శాఖ ఏడీఏ లక్ష్మీ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల సిబ్బంది, ఉప్పు నీటి కేంద్ర పరిశోధన అధికారులు, ఆయా గ్రామపంచాయతీల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి వృద్ధ రైతు మృతి

భట్టిప్రోలు,(కొల్లూరు), సెప్టెంబరు 25 : వృద్ధ రైతు ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని సూరేపల్లి శివారు తాతావారిపాలెంలో పడమట రామారావు (77) వరి పైరు పరిశీలించేందుకు వెళ్లగా ఆ సమయంలో వర్షం కురుస్తుండటంతో ప్రమాదవశాత్తు జారి పక్కనే ఉన్న కాల్వలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు పొలం వెళ్లి గాలిస్తుండగా వేమవరం ఛానల్ నుంచి పెదవరం వెళ్లే కాల్వలో వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు.

ఖోఖో రాష్ట్ర జట్టులో పంగులూరు విద్యార్థులు



శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు, వి.సాగర్

పంగులూరు, సెప్టెంబరు 25 : జార్ఖండ్‌లో ఈనెల 28 నుంచి జరిగే జాతీయ స్థాయి బాలుర ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు పంగులూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎ.శ్రీనివాస్, పి.వెంకటేశ్వర్లు, 8వ తరగతి విద్యార్థి వి.సాగర్ జట్టులో స్థానం పొందారు. విద్యార్థులను హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

అన్నాచెల్లెళ్ల ఆత్మహత్యాయత్నం

బల్లికురవ, సెప్టెంబరు 25 : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామంలో అన్నాతమ్ముళ్ల పిల్లలు వరుసకు అన్న చెల్లెళ్లు అయిన యువతీయువకుడు బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అందిన సమాచారం మేరకు.. కొమ్మినేనివారిపాలెం గ్రామంలో అన్న తమ్ముళ్ల గృహాలు పక్కపక్కనే ఉన్నాయి. బుధవారం ఉదయం ముందుగా వారిలో ఒకరి కుమార్తె పురుగు మందు తాగగా, గంట తరువాత యువతికి అన్న వరుస అయిన యువకుడు కూడా పురుగు మందు తాగాడు. వెంటనే వారిని తల్లిదండ్రులు వైద్యం కోసం చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఘటనకు కారణాలు తెలియాల్సి ఉంది.

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

ఏడు ఎడ్ల బండ్లు స్వాధీనం



పట్టుబడిన బండ్లు వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

చీరాలనగర్(చీరాలటౌన్), సెప్టెంబర్ 25 : ఇసుక అక్రమ తవ్వకాలపై చీరాల రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. కొద్ది రోజులుగా ఏదో ఒక చోట దాడులు నిర్వహిస్తూనే ఉన్నారు. బుధవారం తహసీల్దార్ గోపీకృష్ణ ఆదేశాల మేరకు చీరాల నగర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించారు. ఏడు ఎడ్ల బండ్లను అదుపులోకి తీసుకుని వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో పలువురు వీఆర్వోలు. సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి తీవ్ర గాయాలు

పరిస్థితి విషమం, గుంటూరుకు తరలింపు

చీరాలటౌన్, సెప్టెంబరు 25 : ఇటీవల ఓ కాంట్రాక్ట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందిన విషయాన్ని మరువక ముందే మరో వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం ముత్తాయిపాలెంకు చెందిన సుమారు ఎనిమిది మంది చీరాల పరిధిలో విద్యుత్ పనులకు కాంట్రాక్ట్ పద్ధతిలో చేస్తున్నారు. బుధవారం పనులు అయ్యాక విద్యుత్ సరఫరా చేశారు. కొన్నిచోట్ల సరఫరా రాకపోవడంతో పరిశీలించేందుకు తాతా వెంకటస్వామి స్తంభం ఎక్కాడు. దీంతో విద్యుత్ సరఫరా కావడంతో జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించి, పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించారు.

కుమారుడిపై తండ్రి దాడి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబరు 25 : కుటుంబ కలహాల నేపథ్యంలో తండ్రి కుమారుడిపై దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండలం బుర్లవారిపాలెంకు చెందిన కరుణసాగర్‌కు తండ్రి ఏసోబుతో స్వల్ప వివాదాలు ఉన్నాయి. ఈక్రమంలో మంగళవారం తండ్రితో పాటు మరో వ్యక్తి పీటర్‌పాల్ కూడా సాగర్‌పై దాడి చేశారు. బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా, ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

30 నుంచి ప్రాయశ్చిత దీక్షా కార్యక్రమాలు

అద్దంకి, సెప్టెంబరు 25 : తిరుమలలో లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి అపవిత్రం చేసిన ఘటన నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు జనసేన ఆధ్వర్యంలో దేవాలయాలలో కార్యక్రమాలు నిర్వహించేందుకు నేతలు పిలుపు నిచ్చారు. బుధవారం పార్టీ కార్యాయలంలో నియోజకవర్గ నేతలు సమావేశం అయ్యారు. 30వ తేదీ సాయంత్రం గ్రామాలలోని దేవాలయాలలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించాలన్నారు. 1న నమో నారాయణాయణ మంత్రాన్ని ప్రతి ఒక్కరూ పఠించాలని, 2న నగరసంకీర్తన, 3న ఆలయాలలో భజన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు చల్లా కృష్ణ, చెవుల వెంకట్రావు, కొట్టే నరసింహారావు, రామాంజనేయులు, పూర్ణచంద్రరావు, తోట కృష్ణ, చిరంజీవి, జానకిరామయ్య, రాజశేఖర్, సాంబశివరావు పాల్గొన్నారు.

పశ్చిమాన భారీ, తూర్పున మోస్తరు

జిల్లావ్యాప్తంగా వర్షం

సగటున 33.0 మి.మీ నమోదు

పలుచోట్ల పొంగిన వాగులు, వంకలు

అక్కడక్కడా రాకపోకలకు ఆటంకం

ఖరీఫ్ పైర్లకు జీవం, రబీ సాగుకు అనుకూలం

ఒంగోలు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా బుధవారం వేకువజామున వర్షం కురిసింది. పశ్చిమ ప్రాంతంలో భారీవర్షమే కురవగా తూర్పు ప్రాంతంలో ఒక మోస్తరు జల్లులు పడ్డాయి. బుధవారం ఉదయం 9 గంటలకు గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 33.0 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పొదిలి మండలంలో 104.6 మి.మీ నమోదు కాగా మార్కాపురంలో 77.6 మి.మీ కురిసింది. అలాగే కంభం, కేకేమిట్ల, బీపేట, దర్శి, తర్లుపాడు, మర్రిపూడి, దొనకొండ, సీఎస్ పురం, కురిచేడు మండలాల్లో 50 నుంచి 75 మి.మీ కొమరోలు, సింగరాయకొండ, ముండ్లమూరు తాళ్లూరు, పీసీపల్లి, పామూరు, పెద్దారవీడు మండలాల్లో 25.0నుంచి 50.0 మి.మీ మధ్య నమోదైంది. ఇతర చోట్ల ఒక మోస్తరుగా జల్లులు పడ్డాయి. కాగా పశ్చిమ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతో పలుచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దీంతో ఆ ప్రాంతంలో రాకపోకలకు కూడా కొంతసేపు అటంకం ఏర్పడింది.

వాగులో చిక్కుకున్న బస్సు

పొదిలి మండలం బట్టువారిపల్లి వద్ద వాగు పొంగి అందులో ఆర్టీసీ బస్సు చిక్కుకకపోగా అధికారులు సురక్షితంగా బయటకు చేర్చారు. బస్సులో ప్రయాణికులు పెద్దగా లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మార్కాపురం-పొదిలి మార్గంలో రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. తర్లుపాడు, మార్కాపురం, కంభం, అర్ధవీడు, బీపేట తదితర మండలాల్లోనూ అక్కడక్కడ వాగులు పొంది రవాణాకు అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా ప్రస్తుత వర్షం సాగుకు బాగా ఉపయుక్తం కానుంది. ఖరీఫ్‌లో దాదాపు 2.75 లక్షల ఎకరాల్లో పంటలు వేగా 90 శాతం పొలంలోనే ఉన్నాయి. ప్రధానంగా కంది, పత్తి, సజ్జ వంటివి ఉండగా వాటన్నింటికి ఈ వర్షం జీవం పోసింది. పలుచోట్ల పొగాకు, మిర్చి, వరి నాట్లు వేస్తుండగా అవి అధికంగా సాగుతున్నాయి. ఇక వచ్చే నెల 1 నుంచి ప్రారంభం కానున్న రబీ సీజన్ పంటల సాగుకు ఈ వర్షాలు బాగా మేలు చేయనున్నాయి. ప్రధానంగా పొగాకు, మిర్చి, వరి సాగు అక్టోబరులో పశ్చిమప్రాంతంలో అధికంగా వేస్తారు. అలాంటి ప్రాంతాలకు ఈ వర్షాలు బాగా ఉపకరించనున్నాయి. అలాగే తూర్పు ప్రాంతంలోనూ రబీ సాగుకు భూములు సిద్ధం చేసుకునే విధంగా వర్షాలు ఉపకరించనున్నాయి.

ఎక్సైజ్ డీసీగా హేమంత్ నాగరాజు

పలువురు అధికారుల బదిలీ

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు25: ఎక్సైజ్ శాఖలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను విలీనం చేసారు. ప్రస్తుతం పాత పద్ధతిలోనే జిల్లాను యూనిట్‌గా తీసుకొని డిప్యూటీ కమిషనర్‌గా నెల్లూరులో ఎస్ఈబీలో ఉన్న కె.హేమంత్ నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా అసిస్టెంట్ కమిషనర్‌గా కె.విజయ, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎస్.కె.ఖాజామొహిద్దీన్‌ను నియమించారు. ఈ మేరకు ఖాజామొహిద్దీన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఉన్నతాధికారులను కలిసేందుకు విజయవాడ వెళ్లారు.

మళ్లీ ఫ్లెక్సీల రగడ

టీడీపీ శ్రేణుల నిరసన ప్రదర్శన

ఒంగోలులో బాలినేని బొమ్మలు చించివేత

ప్రధాన కూడళ్లలోని ఫొటోల తొలగింపు

ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసిన మాజీమంత్రి

లాయర్‌పేటలో జనసేన నాయకుల నిరసన

నేడు జనసేన పార్టీలోకి బాలినేని



చించివేసిన బాలినేని ఫ్లెక్సీ

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 25 : మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరేందుకు సిద్ధమైన వేళ ఒంగోలు ఫ్లెక్సీల రగడ మరోమారు రాజుకుంది. తొలుత బాలినేని పార్టీ మార్పుపై ఎమ్మెల్యే జనార్దన్ ధ్వజమెత్తడం, అంతకుముందు మాజీ మంత్రి అనుచరులు వేసిన ఫ్లెక్సీని టీడీపీ శ్రేణులు తీసివేసే ప్రయత్నం చేయడం తెలిసిందే. ఆ రెండు విషయాలపై బాలినేని కూడా స్పందించారు. ఈ నేపథ్యంలో గురువారం బాలినేని జనసేనలో చేరే తేదీపై స్పష్టత వచ్చింది. అయితే బుధవారం రాత్రి బాలినేని అనుయాయులు వేసిన ఫ్లెక్సీలను మరోమారు గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. అదేసమయంలో బాలినేనిని జనసేనలో చేర్చుకోవద్దంటూ తెలుగు యువత శ్రేణులు నగరంలో నిరసన కార్యక్రమం నిర్వహించాయి. తిరిగి బుధవారం రాత్రి ఎన్నికల ముందు టీడీపీలో చేరిన సూర్యప్రకాష్‌రెడ్డి బాలినేని మంత్రిగా అవినీతికి పాల్పడినందున పార్టీలోకి చేర్చుకోవద్దంటూ జనసేన అధినేత పవన్‌కు బహిరంగంగా సూచించారు. స్థానికంగా జరిగే అంశాలను పట్టించుకోకుండా గురువారం సాయంత్రమే పవన్ వద్ద మాజీమంత్రిని పార్టీలో చేరాలని సమాచారం వచ్చింది. నగరంలో వ్యాపారవేత్త కంది రవిశంకర్, అతని సమీప బంధువు గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే రోశయ్యలు గురువారం జనసేనలో చేరనున్నారు.

ఎస్పీకి ఫిర్యాదు

మాజీమంత్రి బాలినేని గురువారం జనసేన పార్టీలోకి ఆహ్వానిస్తూ ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని చించివేశారు. లాయర్‌పేటలో ప్రకాశం పంతులు బొమ్మ, వీఐపీ రోడ్డు, జయరాం థియేటర్ సెంటర్, సీవీఎన్ రీడింగ్‌రూం తదితర ప్రాంతాల్లో పెద్ద పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటిని మంగళవారం రాత్రి పెట్టగా, తెల్లవారేసరికి ఎవరో చించి పడేశారు. ఆ ఫ్లెక్సీల్లో కేవలం బాలినేని ఫొటో ఉన్నంత వరకే చించివేసి మిగిలినవి అదేవిధంగా ఉండేలా చేశారు. దీంతో బుధవారం ఉదయం నుంచి ఈ విషయంపై విస్తృతంగా చర్చ నడిచింది. లాయర్‌పేటలో జనసేన పార్టీలోని కొంతమంది ఫ్లెక్సీ వద్ద నిరసన తెలిపారు. మరోవైపు ఒంగోలు నగరంలో ఫ్లెక్సీల చించివేతపై మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం మధ్యాహ్నం ఎస్పీ దామోదర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలినేని వెంట గొర్రెపాటి శ్రీనివాసరావు, జడా బాలనాగేంద్రయాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

కూటమి పాలన ప్రజారంజకం

పింఛన్ రూ.4వేలకు పెంచి ఒకటో తేదీనే ఇస్తున్నాం

సంక్రాంతి నుంచి కొత్త ఇళ్ల నిర్మాణాలు

యూనిట్ వ్యయం రూ.4లక్షలకు పెంపు

దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు : మంత్రి స్వామి



మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ అన్సారియా, అధికారులు

కొండపి, సెప్టెంబరు 25 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వ పాలన ప్రజా రంజకంగా సాగుతున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇది మంచి ప్రభుత్వమని చెప్పడానికి వంద రోజల పాలనే రుజువని పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయాల సముదాయంలో తహసీల్దార్ పి.మురళి అధ్యక్షతన జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.4వేలకు పెంచి ఒక్కరోజులోనే ఇంటివద్దనే అందజేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు 14వ తేదీ ఇస్తే, ఇప్పుడు ప్రతినెలా ఒకటో తేదీన చెల్లిస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం అన్న క్యాంటీన్లు తెరిచి పేదల ఆకలి తీరుస్తున్నామని మంత్రి తెలిపారు. మెగా డీఎస్సీ ప్రకటన ద్వారా 16,300 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులకు మేలు చేశామన్నారు. సంక్రాంతి నుంచి ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో లబ్ధిదారులకు యూనిట్ వ్యయం రూ.4 లక్షలు పెంచుతున్నట్లు చెప్పారు. 2014-19 మధ్య కాలంలో గృహాల నిర్మించుకొని బిల్లులు ఆగిపోయిన వారికి వాటిని చెల్లిస్తామన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించి అనర్హులైన పింఛన్ లబ్ధిదారులను తొలగించి అర్హులకు కొత్తవి మంజూరు చేస్తామని చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పథకాలు విజయం : కలెక్టర్

ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ప్రభుత్వ పథకాలు విజయవంతమవుతాయని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రతి వారం 'మీకోసం' నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. అంతకుముందు హైస్కూల్ ఎదురు బజారులోని పలు ఇళ్లకు మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా వెళ్లి గోడలకు 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్‌లను అంటించారు. యజమానులకు కరపత్రాలు అందజేశారు. సభలో కొండపి ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, డీపీవో ఉషారాణి, డీఏవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ జె.రవిబాబు, ఎంపీడీవో రమణమూర్తి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చైర్మన్లు

ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి : చంద్రబాబు సూచన



సీఎంకు బొకే ఇస్తున్న దినకర్, పక్కన సత్య, బాలాజీ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లాలో కొత్తగా కార్పొరేషన్ చైర్మన్లు అయిన దామచర్ల సత్య, నూకసాని బాలాజీ, లంకా దినకర్‌లు బుధవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిశారు. వీరిలో సత్య, బాలాజీలు టీడీపీ తరఫున, దినకర్ బీజేపీ తరఫున చైర్మన్లుగా ఎంపికైన విషయం తెలిసిందే. బుధవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన కొత్తగా నియమితులైన 20మంది చైర్మన్లతో భేటీ అయ్యారు. ఆ తర్వాత జిల్లాకు చెందిన ముగ్గురు చైర్మన్లు విడివిడిగా చంద్రబాబును కలసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆ సందర్భంగా బాబు మాట్లాడుతూ నిజాయితీగా, సమర్థవతంగా బాధ్యతలు నిర్వహించి ఇటు కూటమి ప్రభుత్వానికి అటు మీరు ప్రాతినిధ్యం వహించే పార్టీల్లో, ప్రజల్లో మంచిపేరు తేవాలని సూచించారు. మారిటైం బోర్డు చైర్మన్‌గా ఎంపికైన సత్యను బాబు బుజం తట్టి ఇంతకాలం పార్టీ పనిలో సక్సెస్ అయ్యారు. చైర్మన్‌గా కూడా విజయవంతమై మాట నిలుపుకోవాలని సూచించారు.

టుబాకో అసోసియేషన్ విరాళం

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఇండియన్ టుబాకో అసోసియేషన్ నాయకులు బుధవారం కలిసి రూ.50లక్షలు వరద బాధితులకు విరాళంగా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాన్ని వారు చెక్ రూపంలో ఇచ్చారు. సీఎంను కలిసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షులు శ్యామ్‌సుందర్, కోశాధికారి గుత్తా వాసుబాబు, ఇతర నాయకులు వైప చౌదరి, రమేష్‌బాబు, ఐటీసీ నుంచి వెంటకరామిరెడ్డి, వీఎస్‌టీ కంపెనీ నుంచి డాక్టర్ లక్ష్మీనరసయ్య తదితరులు ఉన్నారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

ఇంకొల్లు, సెప్టెంబరు 25 : ఇంకొల్లు మండలం నాగండ్లలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై బుధవారం ఎస్ఐ సురేష్ తమ సిబ్బందితో దాడులు నిర్వహించారు. కోడిపందేలు నిర్వహిస్తున్న 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 6 మోటర్‌సైకిళ్లు, రూ.6290, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జడ్పీలో బదిలీల ప్రతిష్టంభన

దర్శి ఎమ్మెల్యే వర్సెస్ టీడీపీ నేత

డిప్యూటీ సీఈవో వద్ద సాగర్ ఒత్తిడి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

జిల్లా పరిషత్‌లో ఎంపీడీవోల బదిలీల వ్యవహారం చినికిచినికి గాలివానగా మారింది. ప్రధానంగా దర్శి నియోజకవర్గంలోని ఎంపీడీవో నియామకాల విషయంలో వైసీపీకి చెందిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త సాగర్‌ల పరిధిలోకి పోవడంతో వివాదం ముదిరింది. బుధవారం జడ్పీ కార్యాలయానికి వెళ్లిన డాక్టర్ సాగర్ డిప్యూటీ సీఈవోతో వాదనకు దిగడం అదేసమయంలో ఒకరిద్దరు ఆయన అనుచరులు ముఖ్యంగా ఒక మీడియా వ్యక్తి దూకుడుగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీకి చెందిన బూచేపల్లి వెంకాయమ్మ జడ్పీ చైర్మన్‌గా ఉండగా ఆమె కుమారుడు శివప్రసాద్‌రెడ్డి దర్శి ఎమ్మెల్యేగా ఉన్న విషయం తెలిసిందే. దీంతో తాము కోరిన వారినే ఎంపీడీవోలుగా వేయాలని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పట్టుపడుతుండగా జడ్పీ చైర్మన్ వెంకాయమ్మ వైపు నుంచి కొన్ని మండలాల అధికారులను తాము కోరినట్లు వేయాలన్న ఒత్తిడి అధికారులపై వచ్చింది. జడ్పీకి ప్రస్తుతం ఇన్‌చార్జి సీఈవోగా మాధురి ఉండగా, డిప్యూటీ సీఈవోగా హనుమంతరావు ఉన్నారు. అనుకూలమైన కొత్త సీఈవోను నియమించుకుని ముందుకు పోవాలని అధికారపార్టీ నేతలు భావించారు. కొత్త సీఈవో నియామకంలో జాప్యం జరిగి రెండు రోజుల క్రితం నెల్లూరు నుంచి చిరంజీవి అనే అధికారిని నియమించారు. ఆయన ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. బదిలీల నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసిపోతుండటంతో ఎంపీడీవోల బదిలీకి శ్రీకారం పలికారు. ఎక్కువ నియోజకవర్గాలకు సంబంధించి అధికార టీడీపీ ఎమ్మెల్యేలు సూచించిన ఎంపీడీవోల నియామకాలు జరిగాయి. దర్శి నియోజకవర్గంలో ఐదు మండలాల ఎంపీడీవోల విషయంలో పోటీ నెలకొంది. ఇటు జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే అయిన శివప్రసాద్‌రెడ్డిలు తాము సూచించిన వారినే ఆయా మండలాలకు నియమించాలని అధికారులపై ఒత్తిడి పెంచారు. మరోవైపు టీడీపీ ఇన్‌చార్జి లక్ష్మి, ఆమె భర్త సాగర్‌లు తాము సూచించిన వారిని ఎంపీడీవోలుగా నియమించాలని ఒత్తిడి చేశారు. ప్రభుత్వంలోని కొందరు ప్రముఖులు ఉన్నతాధికారులు ఇన్‌చార్జి చెప్పిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కూడా మౌఖికంగా సూచించారు. దీంతో అధికారులు ఒత్తిడికి గురై దర్శి నియోజకవర్గ ఎంపీడీవోల నియామకాన్ని బుధవారానికి పూర్తి చేయలేదు.

జడ్పీ కార్యాలయంలో గందరగోళం

ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం జడ్పీ కార్యాలయానికి లక్ష్మి భర్త సాగర్ వెళ్లారు. ఆయన డిప్యూటీ సీఈవో వద్ద ఉద్యోగులను బదిలీ చేసే అధికారం మీదే కాబట్టి తాము సూచించిన వారినే ఎంపీడీవోలుగా పంపాలని పట్టుబట్టారు. కొద్దిసేపటికి ఆ గదిలోకి జడ్పీ చైర్మన్ సీసీ వచ్చి బదిలీలు చేసే అధికారం చైర్మన్‌కు ఉంటుందని, చైర్మన్ సూచించిన వారినే దర్శి మండలాలకు పంపాలని కాదంటే ఇబ్బందిపడతారని హెచ్చరించారు. దీంతో సాగర్ పక్కన ఉన్న దర్శి నియోకవర్గానికి చెందిన వారు చైర్మన్ సీసీ తోటి, అధికారులతోటి వాగ్వివాదానికి దిగారు. ఆ సమయంలో సాగర్‌తోపాటు జడ్పీకి వెళ్లిన జర్నలిస్ట్ దూకుడుగా వ్యవహరిస్తూ, ఉద్యోగులు, సీసీలను నిలదీసి మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో కార్యాలయంలో వివాదం పెద్దదైంది. డిప్యూటీ సీఈవో అటు చైర్మన్ సీసీకిగాని, ఇటు సాగర్‌కు ఎలాంటి హామీ ఇవ్వకుండా మిన్నకుండిపోయారు. ఆ తర్వాత టీడీపీ నాయకుడు సాగర్ కలెక్టర్ అన్సారియాను కలిసి బదిలీల అధికారం సీఈవోకే ఉంటుందని, వారే చేయాలని చైర్మన్ ఒత్తిడికి అనుకూలంగా బదిలీ చేస్తే మేము ముఖ్యమంత్రి వద్దకు వెళ్తామని చెప్పినట్లు తెలిసింది.

అప్పు తీర్చలేక.. వృద్ధురాలి హత్య?


చీరాల్లో మరో ఘటన

కూల్‌డ్రింక్‌లో సైనేడ్ కలిపి హతమార్చిన వైనం

మృతదేహాన్ని కారులో దొనకొండకు తరలింపు

ఆనవాళ్లు లేకుండా చేసేందుకు దహనం

పోలీసుల అదుపులో నిందితులు



గుర్రపడి విజయలక్ష్మి(ఫైల్)

చీరాలటౌన్, సెప్టెంబర్ 25 : చీరాల్లో మరో వృద్ధురాలు హత్యకు గురైన ఘటన అందరినీ కలవరానికి గురిచేంది. గత జూలై 23న చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలేనికి చెందిన విశ్రాంత టీచర్ పిల్లి లలితమ్మ(75)ను హత్య చేసిన విషయాన్ని మరువకముందే మరో వృద్ధురాలి హత్య ఉదంతం కలకలం రేపింది. చీరాల మునిసిపల్ పరిధిలోని ఉజిలీపేటకు చెందిన విజయలక్ష్మి(75) హత్యకు గురైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకెళ్తే... ఉజిలీపేటకు చెందిన గుర్రపడి విజయలక్ష్మికి ఇద్దరు పిల్లలున్నారు. హైదరాబాద్‌లో కుమారుడు(సాఫ్ట్‌వేర్), అమెరికాలో కుమార్తె (సాఫ్ట్‌వేర్) ఉంటున్నారు. ఆమె ఇంటి ముందు ఉన్న షాపును కనిగిరికి చెందిన రవి మరో వ్యక్తి చాలకాలంగా అద్దెకు తీసుకుని టైల్స్ షాపు నడుపుతున్నారు. సుమారు రెండేళ్ల కిందట అగ్రిమెంట్ పూర్తికాగా భాగస్వామ్యం తొలగించి రవి ఒంటరిగా షాపును నడుపుతున్నారు. వృద్ధురాలు ఆర్థికంగా బలంగా ఉండడంతో రవి అప్పటికే ఆమె వద్ద సుమారు రూ.4 లక్షలు వరకు అప్పుగా తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న రవి వృద్ధురాలి బాకీ తీర్చలేననే వేదన పడుతున్నారు. దీంతో అన్నను ఎలాగైనా అప్పు నుంచి బయటపడేయాలని తమ్ముడు తేజ రంగంలోకి దిగాడు. వృద్ధురాలిని వైదొలగిస్తే ఇబ్బందులు తీరతాయనుకున్నాడు. దీంతో కారంచేడుకు చెందిన రాము సాయంతో ఈనెల 15వ తేదీన ఇంటిలో ఉన్న ఆమెను డబ్బులు ఇస్తాం రమ్మని షాపు వద్దకు పిలిపించాడు. పథకం ప్రకారం థమ్సప్‌లో సైనేడ్ కలిపాడు. మాయమాటలు చెప్పి తాగించారు. కొద్దిసేపటికే విజయలక్ష్మి కుప్పకూలింది. వెంటనే కారులో కారంచేడు మీదుగా దొనకొండకు తరలించి మృతదేహాన్ని దహనం చేశారు.

వెలుగులోకి ఇలా...

విజయలక్ష్మి కనిపించకపోవడంతో ఆమె బంధువులు కనిపెట్టి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడికి ఫోన్ ద్వారా చెప్పారు. ఆ తర్వాత బంధువులు అందరూ కలిసి అన్నిచోట్లా వెదికినా ఆచూకీ తెలియలేదు. చివరకు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె అదృశ్యమైన నాటికి ఆమె ఒంటిపై పది సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై పోలీసులు మిస్సింగ్ కేసుగా దర్యాప్తు చేస్తున్నారు. దొనకొండ ఘటనా స్థలంలో అనుమానం వచ్చిన స్థానిక పోలీసులు చీరాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో బుధవారం సీఐ శ్రీనివాసరావు దొనకొండకు వెళ్లి పరిశీలించారు. మంగళవారం రాత్రికే నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనపై నేడో రేపో అధికారికంగా వివరాలు వెల్లడించాల్సి ఉంది.

సబ్‌రిజిస్ట్రార్ హేమలత సస్పెన్షన్

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 25: వైపాలెంలో భూ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అవకతవకలకు పాల్పడిన జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ హేమలతను సస్పెండ్ చేస్తూ డీఐజీ పుష్పలత బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రికార్డులో లేని సర్వే నంబరుతో ఆమె రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో విచారణ చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాలు జారీచేశారు. జిల్లా రిజిస్ట్రార్ ఏ.బాలాంజనేయులు విచారణ చేసి అక్రమాలు నిజమేనని తేల్చారు. దీంతో ఆమెపై డీఐజీ సస్పెన్షన్ వేటు వేశారు అంతేకాకుండా విచారణ అనంతరం క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని అధికారులు తెలిపారు. హేమలత ఇంకొల్లులో పనిచేస్తుండగా డిప్యుటేషన్‌పై ఎర్రగొండపాలెం జాయిట్ సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. ఇటీవల బదిలీలో ఆమెను సింగరాయకొండ వేశారు. వైపాలెంలో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఇంకొల్లులో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : రైతులు సాగులో మెలకువలు పాటిస్తే అధిక పంట దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) కే ధనరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని కలవకూరు, శింగరకొండపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న పసుపు పంటను పరిశీలించి, ఇనుప ధాతులోపాన్ని వ్యవసాయ అధికారులు గుర్తించారు. దాని నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలని ఉద్యాన అధికారి ఎస్.దీప్తి తెలిపారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అశోక్, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సంచాలకులు మస్తాన్‌రావు, తుమాటి సాయిబాబు, గ్రామ రైతులు చింతా వెంకటేశ్వరరెడ్డి, కఠారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పత్తి పంటలో తెల్లదోమ ఉధృతి తగ్గించుకోవడానికి లింగార్షణ బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. నక్కపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తిని పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ గ్రామ సహాయకులు నాగేశ్వరరావు, అన్నపూర్ణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం(చీరాల) : రైతులు ఒక వైపు సేంద్రియ విధానం, మరో వైపు మేలైన యాజమాన్య పద్ధతులను వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పలువురు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. మండల పరిధిలోని పాపాయిపాలెం, అక్కాయిపాలెం రైతు సేవా కేంద్రాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఉష, ట్రైనింగ్ సెంటర్ ఏడీఏ రత్నకుమారి, ఏవో కాశీవిశ్వనాథ్ రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : రైతులు పంటల సాగులో మెళకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించ వచ్చని మండల వ్యవసాయ శాఖ ఏవో కుమారి తెలిపారు. ఉప్పుమాగులూరు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది.

పంగులూరు : పంటసాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక ఫలసాయం సాధించవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి. శ్రీనివాసరావు రైతులకు సూచించారు.మండలంలోని ముప్పవరం, భైటమంజులూరు గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాగులో ఉన్న మినుము, సుబాబులుతో పాటు వరి నారుమడులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి, కుక్కపల్లి ఏడుకొండలు, బ్రహ్మానందస్వామి, రావూరి రమేష్, జగన్మోహన్, తిరుమలరాజు, అప్పలరాజు, వెంకయ్య, వీఏఏలు పృథ్వీ, దిల్లా, మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల నమోదుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉందని వ్యవసాయ అధికారి కిరణ్ కుమార్ అన్నారు. పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాలలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, తాళ్లూరి లావణ్యా కోటేశ్వరరావు, పెంట్యాల శరత్, రాజుగారిపాలెంలో మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు, చింతలపూడి శ్రీను, అచ్చిరాజు పాల్గొన్నారు.

మాగుంట పార్వతమ్మ మృతికి సంతాపం

పంగులూరు, సెప్టెంబరు 25 : స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి, మాజీ పార్లమెంట్ సభ్యురాలు పార్వతమ్మ మృతి పట్ల పలువురు నేతలు, ఎంఎస్ఆర్ కళాశాల అధ్యాపకులు సంతాపం తెలిపారు. పంగులూరులోని ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో పార్వతమ్మ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఉషారాణి పూలమాల వేసి నివాళి అర్పించారు. మూడున్నర దశాబ్దాల క్రితం పంగులూరులో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు విద్యనందించడంతో పాటు పలువురికి ఉపాధి కల్పించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పీడీ సీతారామిరెడ్డి, రావూరి రమేష్, ఆర్వీ సుబ్బారావు, వీరరాఘవయ్య, ఐ.సుబ్బారావు, రవీంద్రనాథరెడ్డి, జేకేసీ, చౌదరిబాబు, నేతలు పాల్గొన్నారు.

పండిట్ దీనదయాళ్‌కు నివాళి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

చీరాల, సెప్టెంబరు 25 : బీజేపీ సిద్ధాంత కర్తల్లో ఒకరైన పండిట్ దీనదయాళ్ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనదయాళ్ పార్టీకి అందించిన సేవలను మననం చేశారు. కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణారావు, మేడికొండ భరణిరావు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ఎండిట్ దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ మండల నాయకులు నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు వెనిగండ్ల వెంకటేశ్వర్లు మార్గదర్శకుడు దీన్ దయాల్ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్లూరి కృష్ణయ్య, కొల్లూరి హరిబాబు, పెనుమాల రామయ్య, దావులూరి సుబ్బారావు, సురేంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసిస్టు డే



మాట్లాడుతున్న కళాశాల అక్రిడిటేషన్స్ డైరెక్టర్ డాక్టరు సుబ్బారావు

చీరాల, సెప్టెంబరు 25 : సెయింట్ ఆన్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫార్మసిస్టు డేని ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఫార్మసీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ వీవీ నాగేశ్వరరావు, అక్రిడిడే షన్స్ డైరెక్టర్ డాక్టరు సుబ్బారావు మాట్లాడుతూ ఫార్మసిస్టు రంగంలో వస్తున్న మార్పులు, అనుసరించాల్సిన విధి, విధానాలను వివరించారు. కార్యక్రమానికి చైతన్య ప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వీ రమణమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో

పంగులూరు, సెప్టెంబరు 25 : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత అధికారులపై ఉందని చీరాల ఆర్డీవో జీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో బుధవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్నారు. అధికారులు, నేతలతో కలసి వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో ఆర్డీవో మాట్లాడుతూ అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో రెండు దశాబ్దాల కిందట రక్షిత మంచినీటి ట్యాంక్‌ను నిర్మించారని, దానిని నేటివరకు వినియోగంలోకి తేలేదని టీడీపీ నాయకుడు ఏడుకొండలు అధికారుల దృష్టికి తెచ్చారు. ఇళ్ల పైనుంచి విద్యుత్ లైన్లు వెళ్లడంతో ఇబ్బందిగా ఉందని, డ్రైనేజీ సమస్యతో పాటు నివేసన స్థలాలు లేక పేదలు ఇబ్బంది పడుతున్నారని కొండలు తెలిపారు. వైసీపీ హయాంలో ఇళ్ల నిర్మాణం పేరుతో ఓ కాంట్రాక్టర్ లబ్ధిదారులవద్ద డబ్బు తీసుకుని నిర్మాణాలు చేపట్టకుండా పరారయ్యారని తెలపగా ఆర్డీవో స్పందిస్తూ హౌసింగ్ ఏఈని వివరణ కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజారావు, ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, టీడీపీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, ఏఈలు రామ్‌కుమార్, కిషోర్‌కుమార్, ఆంజనేయులు, ఏపీఎం జ్యోతి ప్రసాద్, సంతోషం, ఏవో సుబ్బారెడ్డి, కార్యదర్శి జానీబేగం, నాయకులు బ్రహ్మానందస్వామి, గరిమిడి జగన్మోహనరావు, గుదిబండ్ల ఆదిరెడ్డి, జాగర్లమూడి శ్రీనివాసరావు, శివరాజు పాల్గొన్నారు.



కొత్తపాలెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

చినగంజాం : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు రేవు నాంచార్లు, పార్టీ సీనియర్ నాయకులు రాజు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపాలెం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమంలో భాగంగా నోడల్ అధికారి డి.దాసు అధ్యక్షతన బుధవారం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతం శ్రమించిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని వెంకటేశ్వరరెడ్డి అన్నా రు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేవారు. కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ గ్రామంలో ఉపాధిహామీ పథకం నిధులు పది లక్షల రూపాయిలతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు అధికారులు, నాయకులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాబూరావు, గ్రామ ఉపసర్పంచ్ విక్రం, ఎంపీటీసీ సభ్యుడు మరపాల రాంబాబురెడ్డి, టీడీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌కలాంఆజాద్, రామసుబ్బారావు, రాజు ఉదయ్ బాస్కర్‌రెడ్డి, కొక్కిలిగడ్డ విష్ణు, మౌలాలి, వెంకటరమణ, పీకే బ్రహ్మం, తెట్టు శ్రీనివాసరెడ్డి, కొనసం జాలరామిరెడ్డి, పిచ్చయ్య, ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చకచకా చెత్త ఎత్తేశారు

బల్లికురవ, సెప్టెంబరు 25 : మండలంలోని పలు గ్రామాలలో బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో గ్రామాలలో స్వచ్ఛత ఎక్కడ అన్న కథనంపె జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు అన్ని గ్రామాల కార్యదర్శులను అప్రమత్తం చేసి వెంటనే రోడ్ల వెంబడి ఉన్న చెత్తాచెదారాలను తొలగించారు. కొణిదెన, నక్కబొక్కలపాడు, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు, వేమవరం గ్రామాలలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పర్యవేక్షణలో రోడ్ల వెంబడి ఉన్న వ్యర్థాలను యంత్రాలతో తొలగించే కార్యక్రమాలు చేపట్టారు. మురికి కాలువల్లో ఉన్న చెత్తను రెండు రోజుల్లో తొలగిస్తామని వారు తెలిపారు.



కొణిదెనలో రోడ్ల వెంబడి వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది



పరీక్షా పత్రాలాను విడుదల చేస్తున్న రామారావు, ఉపాధ్యాయులు

ప్రతిభను వెలికితీసేందుకే చెకుముకి

చినగంజాం, సెప్టెంబరు 25 : విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే పోటీ పరీక్షలు దోహదపడతాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. మండలంలోని కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్సు సంబరాలు-2024 టాలెంట్ టెస్ట్ పరీక్షా పత్రాలను బుధవారం ఆయన ఆవిష్కరించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక చేయనున్నట్లు రామారావు తెలిపారు. చినగంజాం ఉన్నత పాఠశాలలో పరీక్షా పత్రాలను పాఠశాల హెచ్ఎండీ రత్నకుమారి, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు ఆవిష్కరించారు. రాజుబంగారుపాలెం, పల్లెపాలెం, అడవీధిపాలెం, పెదగంజాం జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టాలెంట్ టెస్ట్ పరీక్షా పత్రాలను ఆవిష్కరించినట్లు నరసింహారావు తెలిపారు. మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ని అక్టోబరు 1వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల సైన్సు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశేష స్పందన

ఇంకొల్లు : విద్యార్థులలో సైన్స్‌పై పట్టు పెంచేందుకు జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పరీక్షకు విశేస స్పందన వచ్చింది. మండలంలో 6 పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు 300 మంది విద్యా హాజరైనట్లు మండల జన విజ్ఞాన వేదిక కన్వీనర్ చెంచయ్య తెలిపారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు పాఠశాల టీంగా అక్టోబరు 1వ తేదీన జరిగే మండల స్థాయి పరీక్షకు అర్హత కల్పిస్తామని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నార్నె సమత, ఎస్‌కే మస్తాన్‌వలి తెలిపారు.

కోలలపూడి హైస్కూల్‌లో అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

మార్టూరు, సెప్టెంబరు 25 : మండల స్థాయి ఉన్నత పాఠశాలల అండర్ 17, అండర్ 14 బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను బుధవారం మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ పోటీలను ప్రధానోపాధ్యాయుడు జీ రామకోటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు పీ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలైన వారు నియోజకవర్గస్థాయిలో ఇంకొల్లు మండలం గంగవరం హైస్కూల్‌లో గురువారం జరగనున్న పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో మండలంలోని 200 మంది బాలబాలికలు ఆటల పోటీలలో పాల్గొన్నారు. పోటీల నిర్వహణకు వ్యాయామ ఉపాధ్యాయులందరూ సహకరించారు. కార్యక్రమంలో తాళ్లూరి శ్రీనునె, శ్రీనివాసరావు, ఖాసిం తదితర ఉపాధ్యాయులు సహకరించారు.



నిరసన తెలుపుతున్న హమాలీలు

హమాలీల నిరసన

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 25 : మండల పరిధిలోని దేశాయిపేట ఎంఎల్ఎస్ (మండల లెవల్ స్టాక్ పాయింట్) వద్ద అందులో పని చేసే హమాలీలు తమ కూలి రేట్లు పెంచాలని డిమాండ్ కళ్లకు గంతలు కట్టుకుని బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రతినిధి పైడయ్య మాట్లాడుతూ హమీలకు కూలి రేట్లు 9 క్రితమే పెంచాల్సి ఉందన్నారు. అయినా పౌరసరఫరాల శాఖ, ప్రభుత్వం హమాలీల కూలీ రేట్లును పెంచలేదన్నారు. అందుకు నిరసన తెలుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి హమాలీల కూలీరేట్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచసే హమాలీలు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు



వీరాస్వామిని సత్కరిస్తున్న ఎంఈవో వెంకట్రామయ్య

పర్చూరు, సెప్టెంబరు 25 : ప్రభుత్వం ఆధ్వర్యంలో ఫెడరేషన్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా పర్చూరులోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌లో జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీలు బుధవారంతో ముగిసాయి. చివరి రోజు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో గేమ్స్ నిర్వహించారు. చివరిరోజు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో మండలంలోని చెరుకూరు జిల్లా పరిషత్, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, ఆక్స్‌ఫర్డ్, వీరన్నపాలెం హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కారుమంచి వీరాస్వామిని విద్యాశాఖాధికారి ఎస్.వెంకట్రామయ్య సారథ్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫాదర్ జోసఫ్ చౌదరి, హెచ్ఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం

ఇంకొల్లు, సెప్టెంబరు 25 : ఇంకొల్లులో బుధవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన కందిమళ్ల సరోజని (82) మృతి చెందగా, రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యశాల డాక్టర్లు నేత్రాలను సేకరించారు. ఇందుకు సహకరించిన కుటుంబసభ్యులను కమిటీ సభ్యులు రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీక్లబ్ అధ్యక్షకార్యదర్శులు రవీ, సాంబశివరావు అభినందించారు.



నూకసానిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సీఎం బాబును కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 25 : సీఎం చంద్రబాబును ఆయన నివాసంలో బుధవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కలిశారు. ఈ సందర్భంగా చీరాల నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని, అందుకు సహకరించాలని సీఎం చంద్రబాబును కోరారు. మరి కొన్ని విషయాలు వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. అనంతరం రాష్ట్రంలో కార్పొరేషన్ ఛైర్మన్లుగా నియమితులైన వారిని కలిశారు. సెక్రటరియేట్‌లో, పలువురు మంత్రులను కొండయ్య కలిశారు. ఫైనాన్స్ సెక్రటరీ, ఎండోమెంట్ బాధ్యులను కలిశారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టిక ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని కొరిశపాడు ఐసీడీఎస్ సీడీపీవో ఏ కృష్ణకుమారి అన్నారు. బుధవారం మండలంలోని వేలమూరిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, ఆహార కిట్లను గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.ఇందిర, బి.ఇందిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : విద్యార్థులు మద్యం, మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని హెల్త్ టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. బుధవారం హెల్త్ స్వచ్ఛంద సంస్థ టీఐ, బాపట్ల హెచ్ఐవీవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో అద్దంకిలోని సాధన జూనియర్ కాలేజీలో మీకు తెలుసా, ఐసీఈ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ, మద్యం, మదకద్రావ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెండ్ బొద్దు నాగార్జున, డైరెక్టర్ వెంకట్రావు, పీఈలు మల్లేశ్వరి, శివపార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లు ఆక్రమణ ఫిర్యాదుపై కేసు

చీరాలటౌన్, సెప్టెంబర్ 25 : తమ ఇల్లును ఆక్రమించడంతోపాటు విలువైన సామగ్రిని విక్రయించారని చీరాల హరిప్రసాద్ నగర్‌కు చెందిన బాల అకమ్మరావు, భార్య యశోద ఎస్పీని ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాలతో వన్‌టౌన్ పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఇసుక డంప్‌లను ఏర్పాటు చేయాలి

చీరాల, సెప్టెంబరు 25 : ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంలో స్థానికంగా ఇసుక డంప్‌లు లేక ఇసుక కొరత ఏర్పడింది. దీంతో నిర్మాణాలు ఆగుతున్నాయని తాపీ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం తహసీల్దార్ గోపీకృష్ణను కలసి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ రంగానికి సంబంధించిన అన్ని పనుల వారికి పని ఆగిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో తాపీ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బల్లికురవ ఎంపీడీవోగా కుసుమకుమారి

బల్లికురవ. సెప్టెంబరు 25 : బల్లికురవ ఎంపీడీవోగా కుసుమకుమారిని నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దర్శి మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న కుసుమకుమారిని బల్లికురవకు నియమించారు. బల్లికురవ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేస్తున్న రాంబాబును మార్టూరు మండల పరిషత్ కార్యాలయానికి ఏవోగా బదిలీ చేశారు. అక్టోబరు మొదటి వారంలో ఎంపీడీవో బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలుస్తుంది.

ఇంకొల్లు : ఇంకొల్లు మండల అభివృద్ధి అధికారిగా ఘట్టా శ్రీనివాసరావును నియమించారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా కోట శ్రీనివాసకుమార్, టైపిస్టుగా భాస్కర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, గురువారం బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి కొరిశపాడుకు బదిలీ అయ్యారు.

జూదరుల అరెస్టు

పర్చూరు, సెప్టెంబరు 25: పర్చూరు మండలం చెన్నుంబొట్ల అగ్రహారంలో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో పేకాట ఆడుతున్న 5గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.10,050 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతు ఉత్పత్తిదారుల గ్రూపులకు రుణాలు

బల్లికురవ, సెప్టెంబరు 25 : వ్యవసాయ సీజన్‌లో రైతులకు ఉపయోగపడేలా రైతు ఉత్పత్తి దారుల గ్రుపులకు సకాలంలో రుణాలు అందజేస్తామని అంబడిపూడి యూనియన్ బ్యాంకు మేనేజర్ అజిత్ తెలిపారు. బుధవారం అంబడిపూడి గ్రామానికి చెందిన ఓం నమఃశివాయ రైతు ఉత్పత్తి దారుల గ్రుపునకు రూ.16 లక్షల రుణాన్ని బ్యాంకు అధికారులు అందజేశారు. పది మంది సభ్యులకు పంటల సాగుకు ఈ రుణం ఎంతో ఉపయెగ పడుతుందని సకాంలో చెల్లింపులు చేస్తే రైతు గ్రుపులకు రుణాలను తమ బ్యాంకు అందజేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సురేంద్రబాబు, ఎఫ్‌పీవో రాయి పేరయ్య, ఫార్మర్ మిత్ర దమ్ము అంజయ్య, రైతులు దద్దాల అంజయ్య పాల్గొన్నారు.

తాగునీటి పథకం వద్ద ఇష్టానుసారంగా ధరలు

- 20 లీటర్లకు రూ.2కు బదులు రూ.5 వసూలు
- ప్రశ్నిస్తే మా ఇష్టం అంటూ బుకాయింపు



భవానీ సెంటర్‌లోని ఎన్టీఆర్ సుజల ప్రవంతి వాటర్ ప్లాంట్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 25 : ప్రజలకు సురక్షితమైన తాగునీటిని తక్కువ ధరకు అందించేందుకు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల ప్రవంతి పథకం నిర్వహణ ఇష్టారాజ్యంగా మారింది. నిర్వాహకులు ధరలను తమ ఇష్టానుసారంగా పెంచి అమ్ముతున్నారు. వ్యాపారులు 20 లీటర్ల క్యాన్‌ను రూ.5కి వసూలు చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇష్టం అంటున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అద్దంకి మున్సిపాలిటీ పరిధిలోని భవానీ సెంటర్‌లో ఆదెమ్మ బడి వద్ద ఎన్టీఆర్ సుజల ప్రవంతి పథకాన్ని ఏర్పాటు చేశారు. ఈ పథకం వద్ద 20 లీటర్ల క్యాన్ నీటిని ఎవరికైనా రెండు రూపాయలకు విక్రయించాలి. ఇది మున్సిపాలిటీ ఆధీనంలో పని చేస్తుంది. అయితే అక్కడ ఉండే సిబ్బంది చిరు వ్యాపారులు, టీ దుకాణాల వారు, టిఫెన్ దుకాణాల వారు వస్తే 20 లీటర్లను రూ.5 వసూళ్లు చేస్తున్నారు. వ్యాపారాలు చేసుకునేవారికి రూ.2కు రాదని, ఇష్టమైతే కొనండి లేకపోతే మానుకోండని అంటున్నారని దుకాణదారులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి క్యాన్ నీటిని రూ.2కే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని చిరు వ్యాపారులు కోరుతున్నారు.

20 లీటర్ల క్యాన్ రూ.2కే అమ్మాలి

ఎన్టీఆర్ సుజల ప్రవంతి వాటర్ ప్లాంట్‌ల వద్ద 20 లీటర్ల నీటి క్యాన్‌ను కేవలం రూ.2కే అమ్మాలి. వ్యాపారులు, టీ షాపులు, టిఫిన్ బండ్లు ఎవ్వరివద్దా కూడా అదనంగా తీసుకోవద్దు. అలా వసూలు చేస్తే చర్యలు తప్పవు.

- ఎం.మరియదాసు, ఏఈ, మున్సిపాలిటీ, అద్దంకి

పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు

- రోగులకు మెరుగైన సేవలకు దోహదం
- ఎమ్మెల్యే ఏలూరి కృషితో అభివృద్ధి
- పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీకి

పర్చూరు, సెప్టెంబరు 25 : పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు జాతీయ స్థాయి గుర్తింపు (నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్) లభించింది. ఈమేరకు నేషన్ హెల్త్ మిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గుర్తింపుతో రోగులకు పూర్తిస్థాయిలో వసతులు, సేవలు అందనున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి, బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న ప్రభుత్వ వైద్యశాలల్లో తొలిసారిగా పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి జాతీయ స్థాయి గుర్తింపు పొందడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా మారినప్పటికీ అరకొర వసతులు, వైద్య సేవలు అందుతున్న తరుణంలో ఆసుపత్రిని గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-19లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవతో రూ.4కోట్ల వ్యయంతో కార్పొరేట్ వైద్యశాలగా అభివృద్ధి చేశారు. గ్రామీణప్రాంత ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న సంకల్పంతో అప్పటి వైద్య ఆరోగ్య మంత్రి కామినేని శ్రీనివాసరావు ద్వారా మరో కోటి నిధులతో వైద్య పరికరాలను సమకూర్చారు. ప్రమాదాల్లో మృతి చెందిన వారి కోసం మార్చురీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే ఏలూరి దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో పర్చూరు ఆసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రోగులకు అందుతున్న సేవలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

రోగులకు మెరుగైన సేవలు



ఆసుపత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించడం ఆనందదాయకం. దీంతో రోగులకు అన్ని రకాల సేవలందుతాయి. ఎమ్మెల్యే ఏలూరి సహకారంతో ఇప్పటికే ఆసుపత్రి కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చెందింది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం.

- డాక్టర్ సిద్ధార్థ, సూపరింటెండెంట్, పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రి